# కవితా కౌముది - 2012





శ్రీ

కౌముది

మీ ముంగిట్లో సాహితీ వెన్నెల

www.koumudi.net



ప్రచురణ సంఖ్య: 126

# విషయ సూచిక


| ఏడాది | నెల | కవిత | కవి / కవయిత్రి | పేజి |
|---|---|---|---|---|
| 2012 | 1 | వేసవి నుండి చలికి (వర్జీనియాలో) | డా నారాయణ గరిమెళ్ళ | 5 |
| | | ప్రయాణం | జ్యోతిర్మయి | 6 |
| | | కాలప్రవాహం | అనంత్ మల్లవరపు | 7 |
| | | కదలిక | జ్యోతిర్మయి బొమ్మ | 8 |
| | | పరదేశి | జాహ్నవి శ్రీధరల | 8 |
| | | రసరేఖలు | శ్రీధర్ బచ్చోటి | 9 |
| | | | | |
| 2012 | 2 | నే ప్రయోజకుడనౌతా | కోసూరి ఉమాభారతి | 10 |
| | | ఆహ్వానం | కన్నెగంటి అనసూయ | 11 |
| | | కన్నీరు | పి వాణి | 11 |
| | | నిశ్శబ్దమే మార్గంగా | అలజంగి ఉదయ కుమార్ | 12 |
| | | రసరేఖలు | శ్రీధర్ బచ్చోటి | 13 |
| | | | | |
| 2012 | 3 | శబ్దమూ నిశ్శబ్దమూ | స్వాతీ శ్రీపాద | 14 |
| | | ఒక మధుర క్షణం | మాధవ తురుమెళ్ళ | 15 |
| | | అభిసారిక | నాగమణి పగడాల | 15 |
| | | బతుకు పుస్తకం | పి వి ప్రసాద్ | 16 |
| | | తిమర సంహారం | డా మూర్తి జొన్నలగెడ్డ | 17 |
| | | జీవనచక్రం | రావెల పురుషోత్తమ రావు | 17 |
| | | నిశ్శబ్దంలో శబ్దం | ఉమాదేవి | 18 |
| | | రసరేఖలు | శ్రీధర్ బచ్చోటి | 19 |
| | | | | |
| 2012 | 4 | ఎవరు ఎవరు | జాన్ హైడ్ కనుమూరి | 20 |
| | | స్వగతాలు | ఎస్ కె వి రమేష్ | 21 |
| | | ఆమె | కన్నెగంటి అనసూయ | 21 |

| | | | | |
|---|---|---|---|---|
| | | ప్రేమ | కుంతి | 22 |
| | | మన తుది మజిలీ | నయొనిక | 23 |
| | | తొలి వలపు | వర్మరాజు సాగి | 23 |
| | | రసరేఖలు | శ్రీధర్ బచ్చోటి | 24 |
| | | | | |
| 2012 | 5 | వెన్నెల ధార | మణి వడ్లమాని | 25 |
| | | స్వగతాలు | ఎస్ కె వి రమేష్ | 26 |
| | | ప్రేమకు ఫలితం | కరుణ | 26 |
| | | ప్రేమ కట్టడం | రేణుక అయోల | 27 |
| | | వెర్రి ఆశ | జ్యోతిర్మయి | 28 |
| | | నడి వయస్సు | శ్రీనివాస ఫణి కుమార్ డొక్కా | 30 |
| | | చంద్రునికో నూలుపోగు | కోసూరి ఉమాభారతి | 31 |
| | | రసరేఖలు | శ్రీధర్ బచ్చోటి | 32 |
| | | | | |
| 2012 | 6 | నువ్వు – నేను | వీరేశ్వరరావు ఎమ్ | 33 |
| | | స్వగతాలు | ఎస్ కె వి రమేష్ | 34 |
| | | ప్రణయాంజలి | రావెల పురుషోత్తమ రావు | 34 |
| | | వ్యధ – కథ | విజయ చావలి | 35 |
| | | కాలం చేయి వదలకు | న్యాయపతి వెంకటమణి | 36 |
| | | కొత్త రాగాలు | ఉమాదేవి పోచంపల్లి | 37 |
| | | నరకపు తడి (అను లంచాల కావ్యం) | డా రమణ యశస్వి | 38 |
| | | నన్నే పిలవాలి | దాట్ల దేవదానం రాజు | 40 |
| | | రసరేఖలు | శ్రీధర్ బచ్చోటి | 41 |
| | | | | |
| 2012 | 7 | తడి జ్ఞాపకం.. | నిషిగంధ | 42 |
| | | చంద్ర విలాపం | న్యాయపతి వెంకటమణి | 43 |
| | | ప్రతిఫలం | జ్యోతిర్మయి | 44 |
| | | దూరదర్శిని | డా మాదిన రామకృష్ణ | 45 |
| | | వడగళ్ళ వాన | గడ్డం శ్యామల | 46 |

| | | | | |
|---|---|---|---|---|
| | | ఒక అందం పుట్టినరోజు | కుమారస్వామి | 47 |
| | | కొంగుబంగారం | నెల్లుట్ల సుదర్శన్ రావు | 47 |
| | | రసరేఖలు | శ్రీధర్ బచ్చోటి | 48 |
| | | | | |
| 2012 | 8 | నేను.. | వీరేశ్వరరావు ఎమ్ | 49 |
| | | హృదయవీణ | డా సంధ్యారాణి కొండబత్తిని | 50 |
| | | గుల్జార్ పాట | మధు పెమ్మరాజు | 51 |
| | | వివేకి | అలజంగి ఉదయ కుమార్ | 51 |
| | | రసరేఖలు | శ్రీధర్ బచ్చోటి | 52 |
| | | | | |
| 2012 | 9 | మాసిపోయిన తొలిసంజె | తమ్మినేని  అక్కిరాజు | 53 |
| | | వీడుకోలు | మధు పెమ్మరాజు | 54 |
| | | ఆలోచనాలోచనాలు | ఎస్ కె  వి రమేష్ | 55 |
| | | కాలం మారింది | తమస్విని | 55 |
| | | జీవనది | డా నారాయణ గరిమెళ్ళ | 56 |
| | | రసరేఖలు | శ్రీధర్ బచ్చోటి | 57 |
| | | | | |
| 2012 | 10 | గింజుకునే అక్షరం | డా కె గీత | 58 |
| | | తపన | రాధిక బుక్కా | 59 |
| | | పొలం చెంతన హలం చింతన | దోగిపర్తి రఘురామచంద్రమూర్తి | 60 |
| | | మరీచిక ఏరువాక | నెల్లుట్ల సుదర్శన్ రావు | 60 |
| | | నే తొక్కేసిన  నా అంతరాత్మ | మాధవ తురుమెళ్ళ | 61 |
| | | లెక్కలు అప్పుడు ఇప్పుడు | కర్లపాలెం హనుమంతరావు | 63 |
| | | రసరేఖలు | శ్రీధర్ బచ్చోటి | 64 |
| | | | | |
| 2012 | 11 | ప్చ్ | ప్రతాప వెంకట సుబ్బారాయుడు | 65 |
| | | ప్రేమించు | వీరేశ్వరరావు ఎమ్ | 65 |
| | | అదృశ్య శక్తి | మనస్విని | 66 |
| | | ఆశ | పి వాణి | 67 |

| | | | | |
|---|---|---|---|---|
| | | సంగీతం | యామిజాల జగదీష్ | 67 |
| | | గడియారం vs గుండె | డా కె గీత | 68 |
| | | రసరేఖలు | శ్రీధర్ బచ్చోటి | 69 |
| | | | | |
| 2012 | 12 | సెలవింక | కె క్యూబ్ వర్మ | 70 |
| | | కృతఘ్నుడా | నెల్లుట్ల సుదర్శన్ రావు | 70 |
| | | తరగని వెలుగు | శివరామ ప్రసాద్ మంగు | 71 |
| | | ఆలోచనాలోచనాలు | ఎస్ కె  వి రమేష్ | 72 |
| | | వర్తమానాన్ని వృధా కానీకు | డా రామలక్ష్మి తాడేపల్లి | 72 |
| | | రసరేఖలు | శ్రీధర్ బచ్చోటి | 73 |

# వేసవి నుండి చలికి (వర్జీనియాలో) డా.నారాయణ గరిమెళ్ళ

**వికటాట్టహాసం చేస్తూ బారలు చాపి మరీ**
మిడిసిపడిన పగలు,
ఎవరో నెత్తి మీద కొట్టినట్టు
చూస్తుండగానే కుదించుకు పోతుంది
ఎన్ని నెలల నుండో
పగటి ధాటికి
భయపడి ముడుచుకుపోయిన రాత్రి ..
ఇప్పుడు,
ధీమాగా బద్ధకం విరుచుకుని సాగి
పగటిని చూసి ఎగతాళిగా నవ్వుతుంది
సూరీడు ఎంత ఊతమిచ్చినా...
పగలు,
చలి ముసుగుని
వదులుకోడానికి తంటాలు పడుతుంటుంది
రాత్రి,.
చలితో పాటు
అప్పుడప్పుడూ
చుక్కలకీ చంద్రుడికీ ఆశ్రయమిచ్చి
కిటికీ వీక్షణాలకి పండగ చేస్తుంది
ఎండా కాలం
చివరి వరకూ
చెట్లెగరేసుకున్న
హరిత గాలిపటాలు
చిందర వందరరగా భూమి మీదకు
కూలిపోతాయి

చలిలో మోడువారి
ముడుచుకు పోయిన చెట్లు,
యుద్ధంలో భర్తలను కోల్పోయిన
సైనికుల భార్యలను తలపిస్తాయి
వేసవి వరకూ
అంటనా ముట్టనా అన్నట్టు
ఒంటిని కప్పుకున్న
హాఫ్ స్లీవులూ, స్లీవ్‌లెస్‌లూ
షార్ట్‌లూ , లూజు పేంటులూ
చలికి భయపడి
పరుగు పరుగున
జీను పేంటులనూ
స్వెట్టర్లనూ కోట్లనూ
తెచ్చుకుని
ఒళ్ళంతటినీ కౌగిలించుకు వదలనంటాయి
వృద్ధులూ, హోంలెస్ బికారులూ
తమకి తెలియకుండానే
చలికి, చలి కాలానికీ
శాపనార్థాలు పెడుతుంటారు
చలికాలంలో
అప్పుడప్పుడు అపురూపంగా కురిసే
మంచు పంచదార అందాన్ని
చప్పరించడం కోసం
నేను ఎంతటికైనా తెగిస్తాను
***

# ప్రయాణం

**జ్యోతిర్మయి**

**ఉన్న వూరిని కన్న వాళ్ళని చూసి ఎన్నేళ్ళయిందో..**
ఉరుకులు పరుగుల నుంచి కాస్తంత  ఆటవిడుపు!

కనుచూపు మేరలో ప్రయాణం...
అంగళ్ళన్నీ తిరిగి... అవీ ఇవీ పోగేశాం
అటకమీంచి దుమ్ముదులిపి...పెట్టెలేమో  సర్దేశాం !

ఇంకెంత చుక్క పొడిచే లోపే ఊరు చేరిపోతాం..
అయినవాళ్ళ  సందిట్లో వేగిరం వాలిపోతాం!

మురిపాలు, ముచ్చట్లు, కౌగిలింతలు, పలకరింతలు..
పేరు పేరునా పలకరించి... కానుకలేవో ఇచ్చేశాం!

తిరుపతి వెంకన్న, శ్రీశైలం మల్లన్న
మనకోసమే వేచి వున్నారు మరి!

అదిగదిగో బట్టల దుకాణం, ఆ  వైపునేమో సూపర్ బజారు,
ఈ  పక్కనే నగల కొట్టు, అటు మూలన బోటిక్కు!

తిరిగేశాం...చూశాశాం ...దొరికినవన్నీ కొనేశాం
అవసరముందో లేదో...అక్కడివన్నీ దొరకవుగా!

హడావిడంతా విచ్చు రూపాయలదే..
ఉన్నచోట ఉండక ఒకటే పరుగులు!

ఆవకాయ, నిమ్మకాయ, మాగాయ, వుసిరి,
సోలెడు పసుపు, తవ్వెడు కారం....
పట్టేసాం..దంచేసాం..మూటలన్నీ కట్టేశాం !

ఇంకెంత పొద్దు వాలే లోగానే!
తట్ట, బుట్ట, పెట్టె, బేడా
నట్టింట చేరినయ్!

అర్థరాత్రి జెట్‌లాగ్  భాగ్యంతో..
ఒంటరిగా కూర్చుని తలచుకుంటే..
ఏవీ కన్నవాళ్ళతో గడిపిన నాలుగు క్షణాలు!
ఈ హడావిడిలో విశ్రాంతి  ఏ మూల నక్కిందో మరి!!

***



# కాలప్రవాహం అనంత్ మల్లవరపు

**క్షణాలు, నిమిషాలు, గంటలు గడుస్తూనే ఉన్నాయి**
రోజులు, వారాలు, నెలలు ఆవిరైపోతున్నాయి
జ్ఞాపకాల దొంతరలో ఖచ్చితమైన తేదీ కరువైపోయింది.

నిరంతరం పరుగు , నిర్విరామమైన పరుగు
మనిషిని యంత్రంలా మార్చిన కాలం వెనుక పరుగు
అది కాలనాగు అని తెలిసీ కాటు వేయించుకునేందుకు పరుగు.

భవిష్యత్తు వర్తమానమై గతంలోకి జారిపోతుంటే
గతం గురించి వగస్తూ, భవిష్యత్తు గురించి విచారిస్తూ
వర్తమానం విడిచి ప్రతి నిమిషం గడుపుతూ, ఒక నిమిషం చావుకు దగ్గరవుతూ...

జీవన ప్రయాణపు ఒడిలో తిలకించని సుందర దృశ్యాలు ఎన్నో!
వీనుల ఆలకించని పక్షుల కిల కిలా రావాలు ఎన్నో!
ఆఘ్రాణించని మధుర సౌరభాలు ఎన్నో!

మజిలీ మజిలీకి మధ్య కాస్త విరామం
మలుపు, మలుపుకీ మధ్య కాస్త నిదానం
జీవిత అనుభూతుల సమాహారం, కట్టడి చేయాలి కాల ప్రవాహం. ***

# కదలిక

జ్యోతిర్మయి బొమ్ము

**నిర్లిప్తంగా నిశ్శబ్ధంగా సాగిపోతున్న జీవితం...**
ఒక్కసారిగా తుళ్ళిపడ్డట్టుగా అయ్యింది నీ పరిచయంతో,
ఒంటికి ఉన్న యంత్రికత తొడుగులను విదిలించి కొట్టగానే..
చైత్రమాసపు వెన్నెల మల్లెలంత సౌకుమార్యంతో ముంచెత్తివేసింది..

గతించిన జ్ఞాపకాల స్వరపేటికను కదిలిస్తూ..
కోయిల కమ్మని రాగాన్ని ఆలపిస్తోంది.
ఘనీభవించిన గుండె కవాటాలు తెరచుకుని
హృదయం విహంగమై ఆకాశపుటంచులను తాకుతోంది..

ఈ అనుభూతి కలలోని నిజమో...
లేక నిజం కాబోయే కలో తెలియక తడబడుతున్నాను..
ఈక్షణం అనిపిస్తుంది నాకు..
తిరిగి నేను చిగిరిస్తున్నానేమో అని...

****

# పరదేశి

జాహ్నవి శ్రీధరల

**మనసుముందు కదిలి**
కనులకు దూరమైన ఓ నా నేస్తం!
యంత్రాలతో పని చేస్తూ
యాంత్రిక జీవనంలో పడి
సహచరులను ఓడించాలన్న కసితో
నువ్వేం కోల్పోతున్నానో
తెలుసుకోని అవివేకంతో
పింక్ స్లిప్‌లకు భయపడుతూ
పేస్లిప్‌లకు మురిసిపోతూ
ఖండాలను దాటుకుంటూ
దొరల కొలువే కావాలని
అమ్మా, నాన్నలని ఊళ్ళోనే వదిలేసి
నీ యింటికి నువ్వే అతిథివై
ఒంటరి తనానికి నన్నంకితం కమ్మని శపించావో! దీవించావో!!
బాల్యంలో చిరునవ్వుగా నిలిచి
యవ్వనంలో ఆశయంగా తోడుంటానని మాటిచ్చి
మరి ప్రౌఢంలో ఓ లోటుగా దూరం కావడం..
ఇది నీ ఆశయానికి సంకేతమా!?

****



# రసరేఖలు

శ్రీధర్ బచ్చోటి

**జీవితమ్మునకర్థమ్ము స్నేహమంచు**
చిరము తోడై నడచునది స్నేహమంచు
నింగి నేలయు నిండును స్నేహమంచు
నిత్యమై నిల్చునిల మన స్నేహమంచు

**తలచి తిరిగితి పెక్కు నేస్తముల కూడి**
హృదయమున నిల్పుకొంటి స్నేహితుల కొలది
వారి బంధమ్మదెల్ల శాశ్వతమె నాకు
ఎదను నిల్తురు వసియింత్రు స్మృతిపథాల

**అంతరంగపు భావహర్మ్యాంతరముల**
సతము నడయాడుదురు నాటి సన్నిహితులు
కనులు తెరచిననేమైరొ కానరారు
ఎవరి జీవనయానమ్ములెవరి కొరకు?

**చెలియ! మనము నడచినట్టి చెలిమిబాట**
కలిసి పలికిన మధురమౌ చెలిమి పలుకు
చేయు శాశ్వతమౌ సహజీవనమ్ము
క్షణము కనుసన్న దాటని సఖ్యమిద్ది

**ఇలను దాటిన పిమ్మట నిలచునేదొ**
తెలియజాలకపోయిన తెలియునిద్ది
జీవమున్నంత వరకు నా చెంత నీవు
నీదు చెంతను నేనుంట నిశ్చయమ్ము

# నే ప్రయోజకుడనౌతా!

కోసూరి ఉమాభారతి

**ఏది ఒప్పు, ఏది తప్పు**
పెద్దవారి ఆశయాలు
తీర్చాలన్న తపనా?
సొంతఊహల ప్రతిఘటనా?
మనసు నలుగుతుంది సంశయంతో!

చదువుల్లో గొప్పవాణ్ణవ్వాలని
జాబిల్లి సాక్షిగా మురిపెంగా
గోరుముద్దలు పెట్టిన అమ్మ

తనకు నచ్చిన వృత్తి చేపట్టి
తన కల పండించమంటూ
అన్నింటా శిక్షణా క్రమశిక్షణల్లో
సాకి, పెద్ద చేసిన నాన్న

పోనుపోను ఊహలొచ్చి
ఆలోచనలు సాలోచనలై
సొంతపోకడలు పోరుపెడుతూ
కళ్ళు సొంతకలలు కంటూ
మనసు సొంతత్రోవలు వెతుక్కుంటూ
యవ్వనం పరుగులు పెడుతుంది, ఉత్సాహంగా, ఉల్లాసంగా!
అమ్మ మాట కాస్త సాగినట్టుగా
నాన్న ఆశ మరి జారినట్టుగా
ఈ సారి జాలి, మరోసారి విసుగు

నా మనసు తూర్పుకి ఉరకలేస్తుంటే
వాళ్ళ వైఖరి పడమటి దిక్కునే ఆగిపోతుంది!
నాదైన చింతన నన్ను నడిపిస్తుంటే
నా వారికి నా చింత ఎక్కువైంది!
వయసుపెరిగి, ఓపిక తరిగే
అమ్మకి నాగురించి అశాంతి
నాన్నకి లేదసలు ప్రశాంతి!
ఎలుగెత్తి చెప్పాలనే
నాదారి వేరైనా
నా మనసు మీదే
మీమీద నా ప్రేమ అచంచలమే
నా ఇష్టాలు మీకు కష్టాలనిపించాయేమో కానీ
నా బతుకు మరి నాదే కదా!
మీ కలల బిడ్డగా నన్ను చూడరూ!?
నన్నో మనిషిగా గుర్తించరూ!?
నన్నెదగనిచ్చి, మీరొదిగితే
నా ఆశల గౌరవించి అనుమతినిస్తే
నా కలల బాటలో నేను పయనిస్తా!
మీరనుకున్నట్లు కాకున్నా
ప్రయోజకుడనౌతా!
నేనెంచుకున్న వృత్తిలో ప్రావీణ్యుడనౌతా!
నేను చెడ్డవాడ్ని కానమ్మా!
నీలా మనసున్న వాణ్ణే నాన్నా!!

***

# ఆహ్వానం
## కన్నెగంటి అనసూయ

**మబ్బుల్ని చూసి**
చెట్లు తలలూపుతున్నాయి
అమ్మని చూడగానే
బిడ్డ కేరింతలెక్కువైనట్లు

నీలాకాశంలో
వెలిగే సూరీడు
అమ్మ పాపిట్లో
మెరిసే సింధూరంలా!

ఆకాశంలో
మబ్బుల విడిది
అవని
ఆహ్వానమట

ఆకాశం
అన్నం వార్చింది
అవని ఆకలి తీర్చడానికి!! ***

# కన్నీరు
## పి.వాణి

**మనసు కుదుట పరిచేది కన్నీరు**
గుండె బరువు దించేది కన్నీరు
దేవుడిచ్చిన వరం కన్నీరు
అదేపనిగ రానీకు నీ కంట నీరు

తనివితీరా నవ్వితే తడిసేవి కళ్ళు
గుండెకోతను నిశ్శబ్దంగా తెలిపేవి కన్నీళ్ళు
వేదనతో ఎరుపెక్కేవి కన్నీళ్ళు
అన్నింటికి ఓదార్పు కన్నీరు
కన్నీరే లేకపోతే ఎన్నో భావాలకు మార్గమే లేదు

మనసున్న మనిషికి వరం కన్నీరు
అవధులులేని ఆనందానికి ఆనవాలు కన్నిరు
చేదునిజాల్ని చెరిపేసేది కన్నీరు
తీపిజ్ఞాపకాలకు ఊరట కన్నీరు
కలతలు రేపును, కల్లోలాలను ఆపును
కన్నీటి తడే లేకపోతే గుండెలెన్నో పగులును !! ***



# నిశ్శబ్దమే మార్గంగా.. అలజంగి ఉదయకుమార్

**రణగొణ ధ్వనులకు దూరంగా**

పనికిరాని పసచచ్చిన, పాతబడిన

బాతాఖానీలకు స్వస్తిచెప్పి

నీశ్వాసే ఏకైక ధ్యానంగా

నీహృదయ నాదమే ప్రణవనాదంగా

నీలోనీవై , నిమగ్నుడవై

నిశ్శబ్దపు గాఢ లోతుల్లో

అంతంలేని ఆలోచనలకు శాశ్వతంగా వీడ్కోలు చెప్పి

సుషుప్త స్థితికి సారూప్యమైన

భావరాహిత్య స్థితిలో

ఆత్మాశక్తి, ప్రాకృతిక శక్తిలో

లయం పొందేలా

సదా నిశ్శబ్దంలో రమించు

నీకై నీవే ధ్యానించు

నీలోకంలో విహరించు

భయ భ్రాంతులకు చోటులేని,

ఆర్తికోసం, కీర్తికోసం, లోకం మెప్పుకోసం

పదేపదే ప్రాకులాడే

దాస్యానికి వీలులేని

నలుగురిపై అజమాయిషీ చెలాయించాలనే

అర్థంలేని, వ్యర్థమైన

అహాన్ని ప్రదర్శించాలనే

పరితాప పడనవసరంలేని

సంపూర్ణమైన, పరిపూర్ణమైన

జీవనాన్ని కొనసాగించు

పూర్ణంలో లీనమయ్యేందుకు ఉపక్రమించు!! ***

# రసరేఖలు

శ్రీధర్ బచ్చోటి

ఊహలందున రాయంచలొప్పుచుండు
మనసు లోతుల వెన్నెలల్ తనరుచుండు
కనులు మూయగ జగమెల్ల కాంతి నిండు
కనులు తెరువగ కలలన్ని కరిగిపోవు

కదలిపోయెడునొక చిరుగాలి పాట
తేలిపోయెడునొక మబ్బు తేరు సౌరు
ఎగిరిపోయెడునొక పక్షి యింపు సొంపు
అందనేరక యెటకొ తామరుగుచుండు

సృష్టిలో గల యానందమెల్ల యిట్లు
దరికి చేరక శూన్యమై కరగనేల
తలపులో నిల్చు పుడమి సౌందర్యమెల్ల
మనసులోపలనే తాను మ్రగ్గనేల

ఒక్క హృదయములోన వెల్గొందు కరుణ
ఒక హృదంతరాళమ్ములోనొదుగు శాంతి
విశ్వమందన్ని మనసుల విరియునెపుడు
ప్రేమమయమౌచు జగము శోభిల్లునెపుడు

మహానంద స్సామ్రాజ్యమందు నిలచి
పొంగిపోవుచునొక యనుభూతినొంది
కదలిపోదుమో శాంతి మార్గమ్మునందు
కలలు కందుమో కాదిది కలయటంచు

***

# శబ్దమూ - నిశ్శబ్దమూ

స్వాతీ శ్రీపాద

**అప్పుడప్పుడు నా నిశ్శబ్దానికి**
అందమైన మాటల ఉడుపులు తొడుగుతుంటాను
మౌన నిరాకరణలకు విలువైన ఆభరణాలు అలంకరిస్తాను
ఒక్కోసారి వస్త్రాలంకరణ విస్తృతమై
నిశ్శబ్దం చిన్నబోతుంది
మరోసారి చాలీ చాలని చింకి గుడ్డల్లో సిగ్గుతో
చిమిడిపోతుంది.
ఒక్కోమారు మారుతున్న విలువల మరుగుజ్జు ఫేషన్ల లో
తన్ను తాను నడిరోడ్డున ఆరేసుకుంటుంది
ఏ వేష ధారణైనా
ఒక్కోసారి వెన్నెల చిదిమి వెలిగించిన దీపమవుతుంది
తేజస్సును తెంపి చెక్కిన అపురూప శిల్పమవుతుంది
చింకి పాతల్లో మెరిసే వజ్రపుతునకవుతుంది
మరో మారు
సువర్ణ రాగ రంజితంలో వెలా తెలా బోయే
పాలిపోయిన పిండిబొమ్మవుతుంది
రక్తం విరిగిపోయి జీవం ఎగిరిపోయి
కొత్త వస్త్రాల్లో చుట్టిన శవమవుతుంది
మంచు ముద్దను చెక్కి నిలబెట్టిన
కన్నీటి స్ఫటికమవుతుంది
భాషేదైనా ,స్వరమేదైనా
భావం మాత్రం సరిగ్గానే అమరుతుంది

ఒక్కోసారి మాత్రం
మాటలు
అర్థం కాని ఉషోదయాలనూ
వ్యక్తం కాని సరాగాలనూ
నిశ్శబ్దంలో చుట్టి ప్రశాంతత  వరంగా అందిస్తాయి
అనుభవాలూ  ఆలోచనలూ
ఆస్వాదనలూ వేదనలూ
నిశ్శబ్దానికి రూపాన్నిచ్చి
చరిత్ర నిర్మాణ కార్యక్రమాలౌతాయి
ఎవరితో వారు సుదీర్ఘంగా జరిపే సంభాషణేగా
ఓ పెద్ద నిశ్శబ్దపు మంచుపర్వతం
చుట్టూ పరిభ్రమించే విభ్రమల
కోలాహలంతో వాగ్వివాదమేగా
మాటల పొత్తిళ్ళలో ఒదిగిన నిశ్శబ్దం
నాకు శబ్దమూ కావాలి
కావలసినంత నిశ్శబ్దమూ కావాలి
నన్ను నేను సొంతం చదువుకుందుకు
నా చుట్టూ ప్రపంచాన్ని చదివేందుకు

***

## ఒక మధుర క్షణం
## మాధవ తురుమెళ్ళ

**నిశిరాతిరి కాటుక కళ్ళు నవ్వితే ఒలికినట్లున్న నక్షత్రాలు**
కొంచెం బిడియంగా చుట్టుకున్నట్లున్న పల్చటి వెన్నెల చీరలో
దాచాలని ఎంత ప్రయత్నంచేసినా దాగని అందాలు...
సృష్టి రహస్యాలను
చెవుల్లో గుసగుసలుగా చెప్పే
పిల్ల తెమ్మెరల మంద్రధ్వనులలో,
నునుసిగ్గుగా -
నా గుండెచప్పుడు నేపథ్యంగా
నాలో నిశ్శబ్దంగా ఆలాపించబడుతున్న ప్రేమ గీతం... ---
వికసించిందో, పుష్పించిందో, అహ్లాదభరితంగా చలించిందో,
మల్లెలుగా జాజులుగా అగరొత్తుల పొగలు పొగలుగా
సువాసనలుగా ఆఘ్రాణితమైన మధుర క్షణం
నేను నేను మరిచిపోలేని క్షణం....
నా హృదయపు ప్రేమ సింహాసనం మీద
నమ్మకంగా ఒదిగిన నా నెలవంక
అలవోకగా నను చూస్తూ హత్తుకున్న సిగ్గుల మొగ్గయింది...
నాకొక అస్తిత్వాన్నందిస్తూ తను నాలో కరిగిపోయింది,
నేనేతనుగా తనే నేనుగా త్వమేవాహంగా
ఆహ్లాదంగా ఆప్యాయంగా ఆనందంగా మారిపోయింది...

***

## అభిసారిక
## నాగమణి పగడాల

**మల్లెల సుగంధాలు, జాజుల సౌరభాలు,**
సంపెంగల గుభాళింపు చుట్టిముట్టి..
అలుపెరుగని కోర్కెల ఝరి..
ఉవ్వెత్తున ఎగసిపడుతూ,
ఫాల బిందువులు నాసికాగ్రపు ముక్కెరకు మెరుపు నిస్తూ ,
జారనీయని ఎద పయ్యెద భారంగా,
ఎదురుచూపులు బాణాల్లా గుచ్చుతుంటే....
వెన్నంటే తలపులు నీ కర స్పర్శకై,
ఎర్రబడిన కనుదోయి నీ మంగళ రూపానికై,
ఆశల అలజడి నీ అడుగుల సవ్వడికై
ఆత్మీయతా పవనాలు మోసుకొచ్చే నీ పిలుపుకై
నిరీక్షణలో ఈ అభిసారిక...

***



# బతుకు పుస్తకం

పి.వి.ప్రసాద్

**బతుకు పుస్తకంలో**

గతస్మృతుల పుటల్ని తిరగేస్తే-

ఎన్నెన్నో అనుభవాలు, ఎన్నెన్నో అనుభూతులు

దర్శనమిస్తాయి!

ఒక్కొక్క పుటని  నిశితంగా పరిశీలిస్తే-

జీవనయానంలో సాగే

దశలవారీ అనుభూతుల సారాలు..

జీవితంలో సంభవించే

నిమ్నోన్నతాలు, కష్టసుఖాలు

మననం చేసుకునే

తియ్యటి స్నేహాలు, చేదు జ్ఞాపకాలు

భవబంధాలను పురికొలిపే

ఆత్మీయతలు, అనురాగాలు

బుద్ధి వికాసానికి తోడ్పడే

సంస్కారసౌజన్యాలు,ధ్యాత్మిక సంప్రదాయాలు

మనసు పరిణతను కలిగించే

మార్గదర్శకాలు

తప్పొప్పుల విశ్లేషణలను తెలిపే

ఆత్మ పరిశీలనాంశాలు

ఇలా ఎన్నో... ఎన్నెన్నో...

గోచరిస్తాయి !!

అవి...

మలివయసులో వెంటాడే జ్ఞాపకాలై

నెమరువేసుకున్న ప్రతిసారీ

హృదయస్పందల్ని కలిగిస్తాయి.

***

## తిమిరసంహారం
## డా.మూర్తి జొన్నలగెడ్డ

**వెలుగుకోసం వెతుక్కుంటూ నేను**
నలుగురితో పడమరకెళ్ళాను
తిరిగి తిరిగి ఎక్కడో మరి తేలాను
ఆ పరుగులో పచ్చి నిజమొకటి తెలిసేను
వెదకువారిని వెలుగు వెన్నంటేయుండును
ఆ పై ఓరిమితో ఒకచోట నిలిచినాను
ఆ వెలుగును నలుగురికీ పంచినాను
అపుడపుడు నేను తూర్పుకెడతాను
ఆ వెలుగు కూడ నా వెన్నంటే వచ్చును
మునుముందుకు మంచిదారి చూపుతోను
నలుగురికీ పంచి పెంచమని చెబుతోను!

***



## జీవనచక్రం
## రావెల పురుషోత్తమ రావు

**జీవితం చిత్రమైనది**
వెలుగువేళల్లో
వేదన పడుతుంది
చీకటిసమయాల్లో
చిరునవ్వులు
చిందిస్తుంది.
గుండెగొంతుకతో
గోడును చెప్పుకుంటుంది
హృదయమంతా విస్తరించే
వేదికై నిలుస్తుంది .
జీవితపు నేపథ్యమే అలాదు
యవ్వనంలో
జలపాత ఝరీ ప్రవాహపు సవ్వడులకు
పొంగిప్రవహించే
ప్రేమామృతవర్షిణిగా
ప్రతిభను కనబరుస్తుంది.
నడివయసుకొచ్చేసరికి
నలుపుతెలుపులతెరలవెనుక
నాట్యభామినిగా నర్తిస్తుంది.
అసురసంధ్యలోకి అడుగిడగానే
వయసు నొసలుపై ముసలిరేఖలు
ముద్రించబడిన సమయాన
నిన్నేమో మిణుకుమిణుకుమనే
తారలా ప్రభవింపజేస్తుంది
నన్ను కవ్వింతల తుళ్ళిపాటులతో
మేలమాడేలా నడయాడజేస్తుంది

***

# నిశ్శబ్దంలో శబ్దం

ఉమాదేవి

**చీకట్లు ముసురుకుంటాయి**

వాహనాలు ఇళ్ళకు చేరుకుంటాయి

తలుపులు మూసుకుంటాయి

చిన్నచిన్న శబ్దాలతో

చిరుచిరు నవ్వులతో

కొండొకచో..

రుసరుస చూపుల రువ్వులతో

పలకరింపులౌతాయి..

సన్న వాల్యూమ్‌లో టీవీలు

భోజనాలు..కాస్త విశ్రాంతి

మర్నాటి లంచ్‌కి మెలకువలు

కిచెన్ మూతబడితే

బెడ్ రూమ్ కువకువలు

లైట్లు ఆరిపోతే

చిమ్మచీకటి..దట్టమైన నిశ్శబ్దం!

అప్పుడు మొదలౌతాయి

తలలో రొదలు..సొదలు..

కుం..య్ మనే మెదడు మూలుగులు

ఉండీ ఉడిగీ వాక్యూమ్

బుసబుసలు గుసగుసలు

తెల్లవారేక అందరూ

వారివారి ఉద్యోగాలకు ఊరేగితే

వీధులన్నీ నిర్మానుష్యం!

కర్ఫ్యూలాంటి మౌనం!

మళ్ళీ అదే నిశ్శబ్దం!

అదే మౌనపోరాటం!! ***

# రసరేఖలు

శ్రీధర్ బచ్చోటి

**నిన్ను చూచిన తరినుండి నేటి వరకు**
ప్రీతితో నిన్ను తలచిన ప్రేమ నాది
నిత్యమై యిది నీయందు నిలుచునేమొ!
వత్సరమ్ములు గడువగ పలుచనౌనొ!

**జననమందినదెల్ల యీ జగము వీడి**
బ్రతుకు తీరాంతరమునకు వలస పోవు
నీవు నేనును సూర్యుడు రేవెలుంగు
వెన్నెలయు పాలపుంతయు ప్రేమయున్ను

**వెడలు నాతోడ నా ప్రేమ వెడలునేమొ!**
నేను వెడలిన పిదపనో, తాను ముందొ!
జననమందగలేదు నా జంట యగుచు
ఏనరుంగక మున్నె తానేగునేమొ!

**సాగునిల దాటి యీ ప్రేమ సత్యమిద్ది**
తెలిసికొను లోపలే తానదృశ్యమగునొ!
మరలి వీక్షించుచును కన్నుమరగునేమొ!
ఉన్న లేకున్న బ్రతుకెల్లనుండునిద్ది,

**తలపులందున, పలికెడు పలుకులందు,**
సతము నీతోడ గడిపెడు క్షణములందు,
నిదురలో, స్వప్నములలోన, హృదయమందు,
నిలుచునెల్లవేళలయంచు తలచుచుందు

# ఎవరు? ఎవరు?

జాన్ హైడ్ కనుమూరి

**ఆకురాలిన శిశిరానికి** కోకిలగాన మెవరు నేర్పారు?
మబ్బుకమ్మిన మనసుకు నెమలినాట్య మెవరు నేర్పారు?

ఊపిరి ఊగిసలు ఊయలూగే ఉయ్యాలలో
స్వరగతుల వేణుగాన మవ్వడమెవరు నేర్పారు?

బడికెళ్ళిన బాల్యం కన్నువిప్పిన వేళలో
సొగసులెరిగి సిగ్గు మొగ్గవ్వడమెవరు నేర్పారు?

తూలిపోయే నడకనేర్చిన జీవన పథాలలో
పదుగురెరిగే పరుగులవ్వడమెవరు నేర్పారు

దిక్కులెటు కనిపించని దృక్కులన్నిటిలో
మదినిండిన సిరులవానలో తడవడమెవరు నేర్పారు

పదనిసలు తెలియని పదాల రాగలలో
జానుతెలుగు పాటై ప్రవహించడం నీకెవరు నేర్పారు?

***



# స్వగతాలు
## ఎస్.కె.వి.రమేష్

**అడవి పండుటాకుకైనా**
ఎంత వైభోగాన్నిస్తుందో చూడు
ఇప్పటిదాకా ఊయలలూపి
ఆ గాలి పల్లకీలో మోసుకొచ్చి
సెలయేటిలో ఊరేగిస్తోంది
మరి నీవో?

********

చేసిన మేలు మరువలేక కాబోలు
కొమ్మ కొమ్మ ఆపి మరీ
సన్మానిస్తోంది
రాలుతున్న పండుటాకును.

********

నీ ఎడబాటు
రాయలేని కావ్యమై
నన్ను ఏడిపిస్తుంటే అదేమో
ప్రతి కవితలో నీవు
అమృతం కురిపిస్తూ
నన్నో క్షణమైనా విడువక
సహగమిస్తున్నావు.

********

# ఆమె
## కొన్నెగంటి అనసూయ

**కలలు కన్న కళ్ళను**
కావ్యలకంకితం చేసి
కష్టాల కడలిని
కౌగిలిలో బిగించి
కదిలిందామె కల్పతరువులా
తరతరాలుగా
అతనికి తరగని గనిలా!!

***



# ప్రేమ

కుంతి

**నీవూ నేను మనమైతే ప్రేమ!**
నీకై నేను మైనమైతే ప్రేమ!
నీలో నేను సగమైతే ప్రేమ!
నీవే నేనను మాట నిజమైతే ప్రేమ!

నీ గుండెలో బాధ సుడి తిరిగినప్పుడు
నాకంటిలో కన్నీరు కారితే ప్రేమ!
నీ మనస్సు ఒక్కింత పొంగినప్పుడు
నా తనువు ఉయ్యాలలూగితే ప్రేమ!

నీవొక సమస్యాపదఘట్టన క్షతగాత్రవైతే
నేనొక సాంత్వన వచనా సంజీవని లేపనమైతే ప్రేమ!
నీవొక ఆనంద జలతరంగమువైతే
నేనొక సంతుష్ట జలధితీరమునైతే ప్రేమ!

నీవు భుజిస్తే, నా కడుపు నిండితే
నీవు నిద్రిస్తే, నాకు విశ్రాంతి లభిస్తే
నీవు గెలిస్తే, నాకు నాకు విజయం కైవసమైతే
నీవు ఎదురొడ్డి నిలిస్తే, నాకు గర్వాతిశయమైతే
నీవు మరణిస్తే, నీ స్మరణే నాకు ప్రేరణైతే
నీ బదులుగా మృత్యువు నన్ను కరుణిస్తే
నా మృత్యువు నీకొక జీవితాన్ని ప్రసాదిస్తే
ప్రేమ! అదే ప్రేమ! అనంతమైన ప్రేమ!!

***

## మన తుది మజిలీ

**నయొనిక**

**ఇసుకలో రాసుకొన్న పేరుని,**
చెరిపేసే సరదా కెరటానిది-
మనసులో గీసుకున్న బొమ్మని,
మరిపించే కొంటె ఉరవడి కాలానిది!
నిరంతరం రేవుపై అల్లరి కెరటానిది అలుపెరుగని పోరు
అనవరతం సంధించిన బాణంలా సాగే కాలం తీరు,
సముద్ర పయనంలో సుడిగుండాలు, వేకువ వెలుగులు
ముత్యపు కాంతులు మరెన్నో వింతలు!
జీవనగమనమూ అంతే..
కష్టసుఖాలు, గెలుపు ఓటములు
కన్నీటి వర్షాలు, చిరునవ్వుల పాలపుంతలు,
ఏ పొద్దో నడిసంద్రంలో నను చీకటి తెరలు చుట్టేస్తే
నీ చిరునవ్వు చుక్కాని
దిగంతాల దూరంలో కనిపిస్తుంది
నిన్నటి తీరంలో నాకై నువు ఆత్రంగా చేసే ఆక్రందన
సాగరఘోషలో మూగబారు మాటలా వినిపిస్తుంది

***

## తొలివలపు

**వర్మరాజు సాగి**

**ముసురు కమ్మిన ఆకాశంలో మెరుపులా,**
నా హృదయంలో నీ రూపం!
మబ్బుల్లో తళుకు కదా,
అప్పుడే మాయమౌతుందనుకున్నా-
కానీ, రెప్పవేయడం మరచిన నా కళ్ళు నీ రూపాన్ని
నా మనోఫలకంపై ముద్రించాయి,
వెన్నెల వెలుగుల్లో వికసించిన చంద్రకాంతలా
నీ రూపాన్ని తలచినప్పుడల్లా మనసు పులకరిస్తుంది
సూర్యుని వైపే తిరిగే పొద్దు తిరుగుడు పువ్వులా
ఎదురుగా ఉన్నపుడు నా కనులు
లేనపుడు ఆలోచనలు
నీ చుట్టూ పరిభ్రమిస్తూనే ఉంటాయి!!

***



# రసరేఖలు

శ్రీధర్ బచ్చోటి

గడచిపోయెను జీవితకాలమెల్ల
విరియు సుమములనొకపరి యరయకుండ
గరికపై నిల్చు పొగమంచు కానకుండ
సొగసులొలికెడు ప్రకృతిని చూడకుండ

గడచిపోయెను జీవితకాలమెల్ల
కొండకోనల వెన్నెల గ్రోలలేక
ఇలకు చేరువౌనుల్కల నెరుగలేక
తారకలు గీయు చిత్రముల్ తలచుకొనక

క్షణము దొరకని సుంత విశ్రాంతి లేని
విశ్వసౌందర్యరహితజీవితమునందు
తరలిపోయెనవెన్నొ పుస్తకపు పుటలు
పెరిగిపోయినవింకెన్నొ వెతల జటలు

దారి ప్రక్కలనేమున్న తలచుకొనక
ప్రబలవేగాననడుగులు వైచుకొనుచు
సాగు బ్రతుకున శూన్యమే సర్వమున్ను
క్షణము సారింప లోచూపు సమయమేది?

నిదురలోనైన యొకపరి నిలువకుండ
ఎంత వేగముతో పరువెత్తుచున్న
ప్రేమయొక్కటె పిలుచు నా వెన్నుతట్టి
ప్రకృతి సొబగులు ప్రసరించ బ్రతుకులోన

# వెన్నెల ధార

మణి వడ్లమాని




**వెన్నెల ధార!!** జగతి  అంతా కురిసే  వెండి వెన్నెల ధార!!
అంబరం నుంచి  వర్షిస్తున్న ఆనంద అమృతధార  !!
జలతారు పరదాలు చాటున  వెన్నల రేడు కురిపించే కౌముది ధారలో
ఆమె మోమున వున్న చిరు చెమట చినుకులు కాస్త
ముత్యములై మెరయు చున్నవి
ఆమె కన్నుల కాటుక నిశిధిని పోలియుండగా
కనుపాపల కాంతి కిరణాలు మిలమిల మెరిసే తారకలు వలె వున్నవి
ఆమె కనుదోయి రాకా చంద్రుని చూసి
వికసించిన కలువలేమో అన్నట్లు వున్నవి
ఆమె చెక్కిళ్ళ నిగ్గుటద్దాలలో   జాబిల్లి తొంగితొంగి చూస్తున్నాడు
ఆమె అధరాలపై తొణికిసలాడుతున్న మధువు లొలికించె చల్లని వెన్నెల!
ఆమె నాగినివలె హొయలు పోతోంది
తెల్లని చిక్కటివెన్నెల మొగలిపూల పానుపు వలె వుంది
ఆమె జడలోని విరిసిన మల్లెలు, రేరాజు అందంతో పోటి పడుతున్నాయి
ఆమె వదనం పున్నమి చంద్రుని వెండి వెన్నలలా
చంద్రకాంతులు వెదజల్లుతున్నది
ఆమె దివినుండిభువికి దిగిన అచ్చెర కన్య వలెవున్నది
ఆమె మూర్తిభవించిన ప్రేమదేవత లావుంది
ఆమె దోసిళ్ళనుండి జాలువారుతున్న  వెన్నెల ధార..-
ఆనందంగా ఆ అమృత ధారని పానం చేశాను!
జగమంతా నిదురిస్తున్నవేళ  పుచ్చపువ్వులాంటి వెన్నలలో
ఆమె ఒడిలో నేను !  అలౌకికమైన స్వాప్నిక స్థితి!
అస్తిత్వం వుందా నాకు! ఆమె నేనా? నేనే ఆమెనా? ఏమో?
మానసం విహంగంలా ఎగిరిపోతోంది! అనిర్వచనీయం ఆ అనుభూతి
అంతా ప్రేమమయం! అంతా ఆనందమయం!
వెన్నెల! వెన్నెల! ఎటుచూసినా కురిసే వెన్నెల ధార!!

***

# స్వగతాలు
## ఎస్.కె.వి.రమేష్

**ఆరేసుకున్న పచ్చ చీరలో**
ఒక్కో దారపు పోగు
లాగేస్తున్నాడీ మనిషి
ఆ దారమే వాడి మెడకు
ఉరితాడవుతుందని తెలీక
అంటుందా అడవి.

***

**తారలు కురులు**
ఆకాశం వదనం
సూర్య చంద్రులు కన్నులు
కదిలే మేఘాలే శ్వాసలు
ఇంద్రధనుస్సు పెదవులపై పూచిన నవ్వు
నింగి నుంచి నేల దాక అనేక వర్ణాల చీరగట్టి
ఆనందాన్ని అడవిగా విరబూయించి
నిట్టూర్పుల కూర్పుతో ఓ ఎడారిని చేసి
తనతో తానే సంగమించే ప్రకృతి కాంత
నీ నా కళ్ళ సాక్షిగా.

***

**రాలిన పండుటాకును**
తన నీడన పెట్టుకుని వృక్షం
ఎదురుగా ఉన్న వృద్ధాశ్రమాన్ని దెప్పిపొడుస్తోంది

***

**నీ పరిచయం ఏమి మిగిల్చింది నాకు**
నాలో లేని నన్ను తప్ప
నీ అజ్ఞాతం ఏమి మిగిల్చింది నాకు
నీకై వెదికే నన్ను తప్ప.

***

# ప్రేమకు ఫలితం
## కరుణ

**ఇష్టపడితే కష్టపెడతావు**
ఆరాధిస్తే ఆవేదన కలిగిస్తావు
వెంటపడితే చీదరిస్తావు
ఆరాటపడితే చిరాకు పడతావు
ప్రేమించితే తృణీకరిస్తావు
నీ నిరాదరణ నన్ను నిరంతరం
నిర్దాక్షిణ్యంగా హతమారుస్తూ ఉంటే -
నీపై కలిగే నా ప్రేమ మళ్ళీమళ్ళీ
నన్ను బ్రతికిస్తూనే ఉంటుంది..!

***



# ప్రేమ కట్టడం రేణుక అయోల

**జారుతున్న మంచు దుప్పటిలో**
ఉదయించే సూర్యకిరణాల వెచ్చదనంతో
ధ్యానంలో నిమగ్నమైన యోగిలా
అంతంత మాత్రమే ప్రవహించే యమునానది కన్నుల్లో
ప్రతిబింబంగా మారాలని ప్రయత్నించే తాజమహల్ మెట్లమీద
ఈ ఉదయం అపురూపం.

శరీరం శిధిలమై చరిత్రలో భాగమైపోయింది
ప్రేమ సజీవమై పాలరాతిగుండెలో ఒదిగిపోయింది
అడుగు అడుగునా ప్రేమ శిల్పచాతుర్యాలలో నిండి
తనఒడిలో చేరమంటూ పిలుస్తోంది.

ప్రేమాన్వేషణ మొదలవుతుంది
జారిపోయిన గతంలోంచి శిధిలమవుతున్న ప్రేమ జీవించి-
ప్రేమలేఖని అందించి చదువుకోమంది
ఎన్నో అక్షరాలు గుండెలో వాలి
స్వప్నజగత్తుని సిద్ధంచేసి అనంత తీరాలకు మోసుకు వెళతాయి.
ఎన్నో భాషలలో ప్రేమ తాజమహల్ మెట్లనిండా పరుచుకుంది
పూచిన ప్రేమపూలని ప్రతి పాదం స్వీకరించింది
2
గైడ్ వివరించే చరిత్రలో
కఠినశిలలు మోసిన కూలీల చెమటధారలు
చలువరాతి పలకలకింద నలిగిన బతుకుల ఆనవాళ్ళు
రాతిలో పూసిన పూలరెమ్మలలో కనిపిస్తాయి
వేళ్ళుతీర్చిదిద్దిన నగిషీలచిత్రాలు "తాజమహల్"అత్మని కమ్ముకున్నాయి

ప్రేమ చరిత్ర రెండు మనసుల్లో ప్రవహించినప్పుడు
ఆ మహకావ్యానికి మౌనంగా ' సలాం' చెప్పడం
ఆ సాయం సంధ్యలో షాజహాన్ ప్రేమని మోసుకెళుతున్నంత అనుభూతి..

***

# వెర్రి ఆశ

## జ్యోతిర్మయి

**అయినా అంత తొందరేంటి నీకు?**
కలిసే వెళ్దాం  అనుకున్నాం కదా!
నువ్వొక్కదానివే అలా వెళ్ళిపోవడమేనా?

ఎవరేమైతే నీకేం? ఎవరెలాపోతేనేం?
అరె....వెళ్ళే ముందు కనీసం ఓ మాట...

అయినా ఏ రోజు నువ్వు నా మాట విన్నావు కనుక!
నా కోసం వేచి వుండకన్నానా ...
రాత్రవనీ, అపరాత్రవనీ,
నేనొచ్చేదాకా కళ్ళు వాకిటనే!
తిండీ లేదూ ...నిద్రా  లేదూ....

అసలు నువ్వెంత గడుసుదానివంటే...
నా ఇష్టాలేంటో  తెలుసుకున్నావు కాని,
కనీసం ఒక్కసారైనా, నీకు నచ్చేవేంటో  చెప్పావా?
నన్ను పసివాడిగా  మార్చి  ఏమి తెలియకుండా చేశావ్!

నీ కెంత స్వార్థం లేకపోతే...
సంతోషాన్నంతా మూట కట్టుకుని,
విషాదాన్ని విరజిమ్మివెళ్తావ్ ?

నాకేనా పౌరుషం లేనిది?
నీ తలపులన్నీ ఈ పూటే తుడిచేస్తా....

అదేంటో.... చెరిపేస్తున్నకొద్దీ  కనిపిస్తూనే వున్నయ్
ఊట బావిలో నీరులా....
అవి కూడా నీ అంతే మొండివి మరి!

నీ ఉనికితో నా మనసంతా వెల్లవేసినట్టున్నావ్
ఏ వైపు చూసినా నీ రూపమే!

నువ్వు మొన్న కట్టిన పచ్చ చీర
జ్ఞాపకాల అలల్ని రేపుతోంది!
నువ్వు నాటిన మల్లెమొక్క
నిను గానక... బిక్క మొహం వేసింది!

నా సంతోషానికి అవసరమైన మందేదో
చెప్పడం మరిచిపోయావ్,
ఎదుటనున్న కాలం అంతా....
నీ తలపులు మోస్తూ బ్రతకమన్నావా!

తిట్టానని కోపగించుకుని రాకుండా వుండకేం!
మరుజన్మలోనైనా... నన్ను కలుస్తావని వెర్రి ఆశ!! ***



# నడి వయస్సు

శ్రీనివాస ఫణికుమార్ డొక్కా

*( వంగూరి ఫౌండేషన్ నిర్వహించిన పోటీలలో బహుమతి పొందిన కవిత)*

**ఇది వసంతం కాదు**
ఈ చిగుళ్ళన్నీ ఎప్పుడో గట్టిపడ్డాయి,
ఇది గ్రీష్మమూ కాదు
తాపాగ్ని కీలలు ఈ శరీరాన్ని సంపూర్ణంగ దహించలేక పోతున్నాయి,
వర్షార్తవ మసలే కాదు
కష్టాల కరి మబ్బులూ, కన్నీళ్ళ కుండపోతలూ ఈ కళ్ళకి అలవాటైపోయాయి,
ఇది శరత్తూ కాదు
నిర్లిప్తత నీడలు మనసులోని వెన్నెలని మింగేస్తున్నాయి,
పోనీ హేమంతమూ కాదు
చలిరాత్రి దుప్పట్లో ఒక్కణ్ణే ఉన్నా నిద్రపట్టేస్తోంది,
అలాగని శిశిరమూ కాదు
పంచప్రాణ పత్రాలు ఈ కట్టెని ఇంకా గట్టిగా పట్టుకునే ఉన్నాయి,
మారుతున్న కాలంతో బాహ్య శరీరం మారిపోతున్నా, లోపల మాత్రం..
స్థితప్రజ్ఞతో, చిరకాల జడత్వమో
ఏదో తెలియని భావం, స్థిరంగా పేరుకుపోతోంది..! ***



# చంద్రునికో నూలుపోగు

కోసూరి ఉమాభారతి

**వెక్కివెక్కి ఏడ్చినప్పుడు** అక్కున చేర్చుకునేది అమ్మ
వాననీళ్ళలో కాగితపు పడవలతో ఆడించేది అమ్మ
ఆటైనా పాటైనా తానోడి నన్నే గెలిపించేది అమ్మ
వేలెట్టుకునడిపించి బడిలో అమ్మేగా దిగవిడిచేది!
తిరగడానికి కారుఇచ్చి విద్యల్లో ఎదగడానికిఊరుమార్చి
ఇంటాబయటా అన్నిటా నావైపే నిలిచేది అమ్మ
చదివి అలిసినప్పుడు తన ఒడిలో సేదతీర్చేది అమ్మ
డిగ్రీచదువులు కోరిన నగలు రంగులకలలు అమ్మచలవే !
సమస్యలనెదురించి బతుకు పరీక్షల్లో నెగ్గడం నేర్పింది అమ్మ
రోజులెప్పుడూ మనవేకావని చెప్పింది కూడా అమ్మే!
నేనదిరినా బెదరినా చేయూతనిచ్చింది అమ్మ
అందంగా ఎదిగనన్నుచూసి తెగ మురిసింది అమ్మే!
కష్టంతెలీకుండా నష్టంకలగకుండా కొమ్ముకాసిందీ అమ్మే!
అన్నిటా నాకు పెన్నిధి తానే అయింది అమ్మ
నేకలత పడితే తొలుత చెమరించిన కన్నులు అమ్మవే!
నానలతలకి ఎప్పుడైనా అమ్మ సేవలేగా ఔషధాలు!
కాలాలుమారినా వర్ణాలు వెలిసినా జలాలు ఉప్పొంగినా
తొణకనిది అలుపెరగనిది నిండైనా అమ్మ మనసేగా
ఆమెత్యాగానికి బిడ్డనైన నాభాగ్యానికి నామాతృమూర్తికి
పాదాభివందనాలు శతకోటిఅభివందనాలు!!
వయసు పైబడినా చూపు పలుచనైనా
భోగాలు నాకందించి యోగినిలా వెలుగు పంచింది
ఏమని తలవను అమెనెలా మరువను?
నాదేవతే ఐనా అమ్మకి ఇదో చిరుసందేశం...
నీప్రాపకంలో ఎదిగిన నేను నీ జ్ఞాపకాలలో ఒదిగినప్పుడు,
జీవితయాత్ర సుదీర్ఘమై తోచినప్పుడు,
దిక్కువై చిరుదివ్వెవై చెలిమివై చేయూతవై,
నా దారులలో వెలుగులు నింపేది నువ్వేగా అమ్మా! ...... ***

# రసరేఖలు శ్రీధర్ బచ్చోటి

**అందముగ** వెలిగెడు హృదయమ్ములెన్నొ
అన్నివైపుల చుట్టి యాహ్లాద పరచు
మదిని సోకును చల్లని మారుతమ్ము
మంచితనమిల సర్వసామాన్యమవగ

**ఎల్లరును** మంచివారలే యీ జగాన
ఇంటివారలిరుగుపొరుగింటి వారు
ఊరి వారలు ధరనున్న వారలెల్ల
మంచితనమునకెల్లరు మారు పేర్లు



**హృదయసౌందర్యతేజమెల్లెడల** నిండి
జగతి సర్వమ్మునానందఝురుల నించు
కల్మషమ్మును దుశ్చింత కానరాని
పరమరమణీయ సీమయ్యె బరగు జగము

**ఇది యసాధ్యము,** నిజము కాదిది యటంచు
తెలియునైనను తేలెద కలలయందు
కలలు నిజములై నిలువవు, కరుగు తుదకు -
స్వర్గముననైననీ కోర్కె సాధ్యమగునె!

**హృదయమును పిండి,** నూనెబొట్లిన్ని తెచ్చి,
ప్రమిదలో నింపి, ప్రేమ దీపమ్మునెత్తి
అల్పకాంతిని వెలయింపనాంధ్యమందు
ఆశ జనియించు చీకటి యల్పమౌను

# నువ్వు - నేను

వీరేశ్వరరావు.ఎమ్

**అంతరంగంలో అహాన్ని నింపుకొని**
అహరహం కార్పొరేట్ బరిలో
పోటీపడి స్పర్థలలో వ్యర్థమౌతుంటాము!
శతృశిబిరంలో సైనికులమై
శిశిరాన్ని స్పృశిస్తుంటాము!
క్షణాల్ని కాసుల్తో కొలుస్తూ
మిథ్యా తృప్తి వైపు సాగుతుంటాము!
జెండర్ని తిట్టుకుంటూ బ్లండర్లు చేస్తూ
తృష్ణ తీరకపోయినా మృగతృష్ణల వైపు మళ్ళుతుంటాము!
అహాల పొరల్ని చీల్చి
మోహాల తీరాల్ని దాటి
ప్రేమ పొలిమేర దగ్గర
ఆగితే మనం పోగుట్టుకున్న దవగతమౌతుంది!
హిమాలయంలాంటి సమస్య హిమంలా కరుగుతుంది!
అహం మనస్సుని తమస్సులో ముంచినప్పుడే
పంతాలకు పోతూ వసంతాలను విస్మరిస్తుంటాము!
ప్రేమని పంచాల్సిన చోట
ఆయాలు అక్కర తీరుస్తుంటే
నీ కాలవలయం నీకు,
నా కాలవలయం నాకు
ఒక్కరోజు మన వేగాన్ని ఆపి
గమనాన్ని గమనించి విలువల
మూల్యాంకనం చేస్తే
మూలమేదో గోచరిస్తుంది!
ప్రేమతత్వం కాలాతీతమై నిలుస్తుంది!





***

# స్వగతాలు
## ఎస్.కె.వి.రమేష్

**చదువులో వేగం తగ్గిందని**
చావు కబురొచ్చిందా
కార్పొరేట్ కళాశాల
విద్యార్థింటికి.
***

**నిండా చమురున్న**
దీపాలు కొన్ని
కొండెక్కి పోతున్నాయోయ్
చదువుల పేరుతో.
***

**ఉప్పెనకు**
గురువు
నా కన్నీరు.
***

**మండు వేసవే ఐనా**
తరగని జలసిరులతో
ఈ నేలనే దెప్పిపొడుస్తున్నాడు
రైతు.
***

**అనుబంధాలు**
ఎంత లోతుగా వెళ్తే
ఆనందాలు
అంత ఎత్తు ఎదుగుతాయని
చెబుతుందా మాను.
***

**మనసులోని**
అణువణువును పలకరించడంలో
విషాదమంతటి మాటకారి కాదోయ్
ఆనందం.
***

# ప్రణయాంజలి
## రావెల పురుషోత్తమరావు

**ప్రేయసి** యందచందములు పేర్చిన ఊర్వశి యంచు భావనన్
హాయిగ మేళవించి రసపాయిగ చక్కగ తీర్చి దిద్ది కం
దోయిన నిల్పుకున్న ఘనతన్ వరియించితి నింతకాలమున్
బాయక చూడుమమ్మ  నను బాసట గీసట చేయకమ్మరో

**నటనము** సేయగా వెరతు నాట్య సరస్వతిమీద భక్తితో
పటుతరమైన గానఫణితిన్ ప్రకటింపగ వీలుకాదు నే
కటువుగపల్కితంచు కలతన్ వహియింపకుమమ్మ ప్రే యసీ
అటుజని కాంచవమ్మ అసలెందుకు నేనిటు మూర్ఖనైతినో

**నింపుము** పాత్రలో ద్రవము నేర్పుగ బిందువు చిందకుండగన్
సొంపుగ వస్త్ర ధారణము సోయగమొప్పగ సేసి మత్తు రా
వింపుము కన్నులందు చెలియానిటు గాఢపు కౌగిలింతలో
కెంపులు రాల్చెదన్ సుఖపు కేతనమెత్తి ,రథమ్ము  నడ్వగా

**రమ్మిక** ప్రేయసీ సుఖము రాజ్యము సేసెడుపానశాలలో
వమ్మట దుఃఖ సంచయము వారునవాహిణి చప్పరింతలో
కమ్మెడు మత్తు మేఘములుఖాతరు సేయగనేల నింక లా
భమ్మును నష్టమంచు తలపోయుట యేలకొ జీవితమ్ములో!

***

# వ్యధ - కథ

విజయ చావలి

**ఎదలోని రొద**
వెలిబుచ్చితే వ్యధ
ఎదుటివాడి సొద
వినగలిగితే కథ

వ్యధలో మెదిలిన కథ
హృదిలో రేగిన బాధ
వినిపించేవాడి కథనం
ఆలకించేవాడి సహనం

బాధాతప్తునికి జీవన కహానీలైతే
ఊ ` కొట్టే వ్యక్తికి కాలక్షేప బరానీలైతే
వ్యధార్తుని చేదు మనోగతం
వినేవాడికి కాదు అవగతం

అంతా విని అదెక్కడి గోలని
అంతే కావాలని జనాంతికంగా
నవ్వితే, నటిస్తే నిజనైజం కనిపిస్తుంది
తీరిస్తే, వోదారిస్తే మానవత అనిపిస్తుంది

కానీ

వ్యధ పెంచిన మనిషికి వీడు అలుసని
వ్యధ పొందిన మనసుకి వాడు తెలుసని
వొకరి సొదే విని యివ్వగలడా తీర్పు?
వొకరి వ్యధే అని తేగలడా మార్పు?

***

# కాలం చేయి వదలకు న్యాయపతి వెంకటమణి

**కాలం చేయి పట్టుకొని సాగిపో చిన్నారి పాపలా**
సాగుతూనే గమనించు పరిసరాలను
సాగుతూనే సాగనీ నీ అలోచనలు
సాగుతూనే సమకూర్చుకో నీ లక్ష్యాన్ని
పెంచుకుంటూపో నీ జ్ఞానాన్ని కాలం చేయి వదలకుండానే
ప్రతీ నిముషాన్ని మార్చుకో నీ కనుగుణంగా
కాలంతో పాటే నువ్వు నడిస్తే
ప్రతి నిముషం విలువైందని నీకు తెలుస్తే
ఓటమి అన్నది లేదు నీకెక్కడా
సాధించలేనిదేది లేదు
కాని మధ్యమధ్యలో అడ్డువస్తాయి
కొన్ని నీలో ' ని' లు అవే
నిర్లక్ష్యం నిరాశ నిస్పృహ
వాటికి లోబడితే కాలం నిన్ను
విడచి వెళ్ళిపోతుంది నిర్దయగా
అలా జరుగనీకు అన్నీ నీ అదుపులో ఉంచుకో
మరీ మందగమనంతో కాలాన్ని వెనక్కు లాగకు
అలాగని కాలానికన్న ముందు పరుగులు తీయకు
చివరిదాకా కాలంతోనే కలసి నడు
అప్పుడు కాలం కల్పవృక్షమై నీ సంకల్పాలను తీర్చగలదు
కాలం కామధేనువై నీ ఆశలను నెరవేర్చగలదు
కాలం అక్షయ పాత్రగా నీ లక్ష్యానికి చేర్చగలదు
అందుకని
కాలం కలసి వస్తే కాదు
కాలంతో సలసి పయనిస్తేనే
నీది పరిపూర్ణ జీవితం తెలుసుకో

***

# కొత్తరాగాలు

ఉమాదేవి పోచంపల్లి

**మంద్రంగా వినిపిస్తున్నాయి**
మనసును హత్తుకునే రాగాలు
వీణా వాదన లేదు
డప్పు, డోలు తప్ప,
వేణూ నాదం లేదు
కొమ్ము, తప్పెటలు తప్ప,
నాదం నినదించే తంబురా లేదు
గాలిని స్వరాలుగా మార్చే బూర తప్ప!
కాలుస్తున్న ఎండల వేడికి రోజంతా కరిగి,
ఒళ్ళంతా చెమటతో తడిసి, రోడ్లు వేసి, బస్తాలు మోసి
కండలు కరిగేలా కష్టించే శ్రమ జీవుల గానాలాపన అది!
గుండె గొంతుల యుగళగానం అది!
గూళ్ళకు చేరే పక్షుల్లాగా గుడిసెకు చేరుకుని
కలిగితే కూర లేదంటే పచ్చడితో,
ఉంటే రొట్టె లేదా గంజి నీళ్ళు తాగే
అలసిన ప్రాణులు
ప్రపంచాన్నే మరచిపోయి తప్పెట తాళం వేస్తూ ఆడి పాడి,
మరిపించేరు మురిపించేరు.!
పక్షుల్లాగే ఉత్సాహంగా పదాలు పాడే గూడెం అంతా
ఒకే గళంతో ఒకే లయతో
రాత్రి అందాలను రవళిస్తూ
బంగరు కిరణాల రేపటికై
గుండెలోతుల్లో చొచ్చుకునే,
సామగాన సుస్వరాల మధుర ఝరి
ఓ మనిషీ! విన్నావా ఎపుడైనా?
నీలోనూ స్పందించే హృదయం ఉంటే -
నీకది వినిపిస్తుంది, నిన్నది కదిలిస్తుంది!!

***

# నరకపు తడి (అను లంచాల కావ్యం)

## డా.రమణ యశస్వి

**సగటు సుబ్బారావు ఐ.సి.యు.ఏ.సి.లో సేద తీరుతున్నాడు**
వైద్యులు నవ రంధ్రాలు ఆక్రమించి, ప్రాణం పోకుండా మోకాలొడ్డి
కరెన్సీ కట్టలకు ప్రాణాలు పోస్తున్నారు
మెదడు పట్టీ ఇ. ఇ. జి. తరంగాలు
అతని మనసు వేగాన్ని అందుకోలేక
యంత్రం తెర పై గుర్రంలా పరుగెడుతున్నాయి!

అంగుళము తేడా లేకుండా
పట్నంలో బిల్డింగు కట్టాలను కోవటమే నేరమై
వెంటిలేటరు శిక్ష అనుభవిస్తున్నాడు!
'రూలు రూలే మామూలు మామూలే' అని
కొత్త స్లో 'గన్'తో
జనులకు స్లో పాయిజను
ఇస్తున్న మునిసిపాలిటీ వాళ్ళు!

ప్లాను '(దే)ఉడా' అని మొరపెట్టుకున్నా
'సీటు సీటు తడిపితేనే 'అని మొరాయించిన
ఉడా దెబ్బకు షాకయ్యాడు !

కార్యాలయములో ఎక్కడ చూసినా తడి ,తడి ,తడి
పొలాల్లో లేదు, వాగుల్లో లేదు
అధికారుల బల్లల కింద తడి
శ్రీ శ్రీ గారు తడి (వుమను,వైను)లో
స్వర్గం ఉందన్నాడు
కానీ ఇది 'నరకపు తడి '!

అందరికి తడిపి తడిపి గొంతు తడారి పోయింది
అ ఆ లు రాని తాపీ మేస్త్రి తాపీగా పనులు చేసి
అవినీతి మరో కోణం రుచి చూపించాడు
డీ అర్కులు దళారులై
లంచానికి డబులు 'కాటు ' మంచము వేసి పోషించారు!

ఫె యింటు ,ఫెయింటు అంటూ పెయింటరు
తన రక్తాన్నే రంగులుగా మార్చి
'పులి' మిన గోడను చూసి ఫెయింట్ అయ్యాడు!

ప్రతి సీటులో ఒక హస్త (రా)లా ఘువలావు
'ర 'పలకని 'ల' క్ష్మే కొడుకులు
అవినీతి విశ్వరూపం ఆవిష్కరించారు
కొత్త భవనంలో పట్టుమని పదినెలలు
వ్యాపారం చేయలేదు
మూలిగే నక్క మీద 'బీ ఆర్ ఎస్' తాటికాయ వేసారు
మునిసిపాలిటీ వారు
ఎంతోకొంత డీవి ఏషను వుంటుంది లెండీ
ముందు మూడు లక్షలు కట్టి తర్వాత ఆలోచించుకో!
అధికారుల వాదనలో ప్రభుత్వం ఖజానా నింపు!
కొత్త రకం అవినీతి కళ్ళ ముందు ప్రత్యక్షమయింది!
కళ్ళు బైర్లు కమ్మాయి
అయి సీయు ఏ సీ లో సేద తీరుతున్నాడు
సగటు సుబ్బారావు!!



# నన్నే పిలవాలి

దిట్ల దేవదానం రాజు

**అలలు గిరటేస్తుంటాయి**
కిందికీ పైకీ లోపలికీ
తీరాన్ని చేర్చే పిలుపు కావాలి!
మేఘాలు ముసుగేస్తుంటాయి
ఒకటే మెరుపుల కీర్తి కాంక్ష
శిఖరాగ్రం చేరుకోవాలి!
ఒత్తిళ్ళు నలిపేస్తుంటాయి
గుండెతడబాటు..నిద్రలేమి
మనసు తేలికపడే మార్గం కావాలి!
మొగ్గ విడుతున్నపుడు
సున్నితమైన సవ్వడికి
చెవి గూడు విశాలం అయినట్టు
సమూహంలోంచి
ఒకే ఒకడుగా గుర్తించే
ఏకవచన పిలుపు కావాలి
సంకల్పంగానో అసంకల్పంగానో
గుండె చెమ్మగిల్లాలి!
ఎదురుగా తరగని జల
అయినా తీరని దాహం
సృజన నిరంతర పయనం కావాలి!

అనంతమైన అక్షరాలు
కిరణాలై మెరిసి
భావనా ప్రపంచంలో
సరికొత్త లోకాన్ని సృష్టిస్తుంటాయి!
అందమైన శిల్పంలా
రూపుదిద్దుకున్న పదాలు
వాక్యాలుగా పుస్తకాలుగా
నా పేరు వెంట నడవాలి
నాదైన గుర్తింపు కావాలి
ఒక మందిలో
నన్నే..నన్నే పిలవాలి!
ఇదొక ఆత్మవిశ్వాస ప్రకటన
ఈ అక్షర కవాతు
నన్నెప్పటికీ సజీవుడిగా చేస్తూనే ఉంటుంది!

***



# రసరేఖలు

శ్రీధర్ బచ్చోటి

ఎన్ని దినములు వత్సరాలెన్నొ గడచి
కాలగర్భములో తాము కలసిపోయె
ఒక్కనాడైన నీతోడ యుల్లమందు
పదిలపరచిన భావముల్ పలుకలేక

ఏండ్లు పూండ్లును నేలలోనింకిపోయి
కాలమెల్లను మట్టిలో కలసిపోగ
భావములు పలుచనయి నిర్బలములయ్యె
వెలికి రాలేని ప్రేమ యూపిరిని మరచె

ప్రియము మీరగ మాటలు వేల కొలది
పలుకవలెనంచునెన్నెన్నొ కలలు గంటి
తరుగు బ్రతుకున తరుగు వత్సరములట్లు
బ్రాతి యైనవి మాటలు బ్రతుకు చివర

పలుకవలెనన్న మాటలు కొలది యైన
వెడలిపోలేకనింతయే ప్రేమ యున్న
పూర్ణమైనట్టి ప్రేమ సంపూర్ణమెపుడు
ఎన్ని భాగముల్ రాలిపోయినను గాని

విస్తృతము ప్రేమ, జగమెల్ల విస్తరించు,
మదిని తెల్పగ సరిపోవు మాటలెపుడు
పలుకబోవగ బ్రతుకేమొ స్వల్పమయ్యె
నిలచి మాటాడునంతలో నిష్క్రమింతు

# తడి జ్ఞాపకం.. నిషిగంధ

**మారుతున్న మాసాల**
ఊసు వింటూ కరుగుతున్న
ఆఖరి మంచు జాడల తడి రాత్రిలో
జ్ఞాపకమొకటి చిటికినవేలు పట్టుకు ఆపింది..

రాత్రంటే నీ మాటలు మాయమవడమేగా!

దశాబ్దాల క్రితం వినబడ్డ నీ చివరి పలకరింపుతోనే
ప్రతి పగలునీ వెలిగించుకుంటాను..

మనసులోని బ్లాక్ హోల్ చుట్టూ
సంధిభావాల పూలపొదలు..
దోశెడు ఆశల నీళ్ళు
ఝాము ఝాముకీ చిలకరించక తప్పదు!

ఏ వెన్నెల రాత్రో నాలుగు ఆప్యాయతల మల్లెలు
పరాకుగా వెళ్తున్న పడమటిగాలిని పట్టి ఆపగానే
ఒకప్పటి స్పర్శాక్షణాలన్నీ
చుట్టూ జలజలా రాలతాయి..

గూటిలోని గువ్వ పక్కకి వత్తిగిల్లిన చప్పుడు
నా కనురెప్పలపైన నీ పెదవుల ముద్ర
ఆనవాలుని వెదికి తెచ్చింది..

కన్నుల్లో చప్పున కదలాడిన
సెలయేటి కెరటాలు
కదలనంటోన్న కాలాన్ని
తడిపేస్తూ చెప్తున్నాయి....

నీ జాడ లేని ప్రపంచంలో
బ్రతకడం
సాధ్యమే కానీ.. సులభం మాత్రం కాదు!!

***



# చంద్రు విలాపం

న్యాయపతి వెంకటమణి

**ఆకాశంలో హాయిగా విహరిస్తుంటే**
మీ ధరల శరములొచ్చి నన్ను తాకుతున్నయి
అంతటితో ఆగకుండా
నాకూ నా కలువలకు మధ్య
ధరలు తెరలై అడ్డమొస్తున్నాయి
ఏమి చెప్పను నా బాధ
ఎవరు తీరుస్తారు నా వ్యధ
నేనంటూ ఒకడ్ని ఉన్నానని
నా వెన్నెల తెల్లగా చల్లగా హాయిగా
ఉంటుందని మీరెప్పుడో మర్చిపోయారు
కాని
ఆధునికతకు దూరంగా మిగిలిన
చిట్టడవుల కొలనులలోని

నా చిన్ని కలువలు నా కోసం
నిరంతరం నిరీక్షిస్తున్నాయి

చంద్రుడెక్కడా అంటూ చకోరాలింకా
ఎదురు చూస్తూనే ఉన్నయి!
అసలే సూయజ్ లతో గతుకులు పడింది గగనం
రాకెట్లతో గుచ్చారు
పాదం మోపి నా ఎదపై తన్నారు
అది చాలక ఇంకా
మీ ధరలతో నన్నెందుకు గాయపరుస్తారు
దించుకోండి ధరలను మీ అందుబాటులోకి
అందించుకోనివ్వండి
నా వెండి వెన్నెలని
నా కలువలకూ చకోరాలకూ తనివితీరా!! ***

# ప్రతిఫలం

జ్యోతిర్మయి

**సందె మబ్బులు**
చీకటి మాటుకు తప్పుకుంటున్నై !
వేచియున్న కలువపై
వెన్నెల పరచుకుంటోంది!

నిశ్శబ్దపు ఒంటరి రాత్రి
మదిలో ఏ మూలో...
జ్ఞాపకాల దొంతర కదిలిన చప్పుడు!

అప్పుడెప్పుడో...
‘నీకేం కావాలని‘ కదూ అడిగావ్!
ఏం అడగాలో ...
ఎలా చెప్పాలో... తెలియని రోజులు
ఒక్క నవ్వు నవ్వేసి ఊరుకున్నా!

ఆ తరువాతెప్పుడో ...
‘ఏం తెచ్చానో చూడమ‘న్నావ్,
మూసిన గుప్పెట్లో విరిసిన మల్లెలు!

వెన్నెల విహారాలు...
జాజిపూల పరిమళాలు!
వలపు సయ్యాటలు...
సరసాల సరాగాలు!

మోయలేని భారంతో...
మనసు కృంగిన రోజు
కొండంత ఓదార్పైనావు!

అనుభవాలు
పాతాలయ్యాయి!
జీవితం గోదారి పాయలా
నిండుగా సాగిపోతుంది!

అప్పటి నీ ప్రశ్నకు,
ఇప్పటి నా సమాధానం
మళ్ళీ అదే చిరునవ్వు!

కాలంతో పాటు కలసిపోనీక
నువ్వు కాపాడిన
‘నా నవ్వు‘కు
ప్రతిఫలంగా నీకు నేనేమివ్వగలను?

*****



# దూరదర్శిని డా.మాదిన రామకృష్ణ

**మదిలో ఎవరూ లేరు , నిశ్శబ్దం తప్ప**
మూడింటికి మెలుకువ వస్తే
మదిలో కాసార ఘోష
గత జల సేతు బంధ ప్రయత్న శోష
జలపాత ఝరీ ఘోష
గమనిస్తున్నది మది
తేరిపారని సుషుప్తి మత్తులో
కళ్ళు తెరవక ఆత్మ చక్షువులతో
మదిలో ఏవేవో ఆవిరులు
దూరానెక్కడో ఎగురుతూ ఇంకో మది
గిట్టలచప్పుడు దగ్గరవుతూ ఉన్నది
గందర గోళపు ఊహల్ని దండ గుచ్చుతూ నా మది
నాలానే మేల్కొన్నా నిద్రపోతున్నది ఇంట్లో
దూరదర్శిని, నుదుట ఎర్రని సింధూరంతో
నిశ్శబ్దంగా మూలుగుతూ మూలనక్కి
కరెంటు ప్రమిదలోని నూనె తాగుతూ
రిమోట్ నొక్కితే గందరగోళం - అనవసర అర్థంలేని ప్రభంజనం
నా మదిలో లానే అనేక చానళ్ళు - వార్తల్లోలా వేరే చెప్పే వాళ్ళు
నామదిలో ఒక ఛానల్ని వొత్తాను
మా వూరు,మా స్కూలు,మా పొలాలు
మా వాగు,మా చెరువు,మా చిన్ననాటి నేస్తాలు
తాతయ్యలు,అమ్మమ్మ,దొడ్డమ్మ
అమ్మానాన్నలు ఇలా యెన్నో జ్ఞాపకాలు
రికార్డు చేయని చానళ్ళలా గబగబా
వ్యాఖ్యానమంతా స్వగతంగా
మదినిండా అన్నీ నిండి మగతలో
మళ్ళీ నిద్రలోకి జారుకున్నా
జ్వరంగా ఉన్నవాడి తలనిమిరిన దేవుడిలా
ఇన్ని జ్ఞాపకాల ఛానళ్ళు ఉన్నందుకు
మదినిండా మెచ్చుకున్నా నా టీవీని.!!

**

# వడగళ్ళ వాన

గడ్డం శ్యామల

**సుందర దృశ్యం, కమ్మని కావ్యం, నగరంలో వడగళ్ళ వాన**
అంబరం అమితమైన సంబరం, అవనికి పంచిన వేళ
ఎన్నాళ్ళనుండి దాచుకున్న ఘాటైన ప్రేమో ఆకాశానిది
ఉత్తర దక్షిణ ధ-కృవాల్లా ఎప్పటికీ కలవనివైనా
వాటి విరహవేదన ఎంతనీ!
రసమయమైన సున్నితమైన ప్రేమ ఘనీభవించి
వడగళ్ళుగా భూమిపై కురిపించింది
యెడబాటు భారాన్ని ఆపుకోలేక ఆకాశం బద్దలై
తన అనురాగాన్నంతా కుండపోతగా కురిపించింది,
చినుకు సందేశాన్ని పంపింది!
నల్ల రంగు చీరమీద జరీ పువ్వులు కుట్టినట్లు తారు రోడ్డుపై
వడగళ్ళు
దివినుండి భువికి తారలు దిగి వచ్చినట్లు
అవని అంబరంగా మారి నువ్వే నేను అన్నట్లు
గ్రీష్మ తాపంతో యెండిన హృదయాలలో
వర్ష ఋతువులో వలపు మొలకలు మొలచినట్లు
చంద్రకాంత శిలలు భూమిపై పరచినట్లు
ఎంత అద్భుతంగా ఉందో,
ఐదు క్షణాల వడగళ్ళవాన, అపురూప దృశ్యం
యెదలో యెగిసిన ఆనంద తరంగం!
మరోకోణం..
వడగళ్ళ వాన కడగండ్ల కోన
పేదరైతులకిదే అశనిపాతం
వడగళ్ళ ధాటికి వంగిపోయిన వరివంగడాలు
కొట్టుకుపోయిన పొలాల పంటలు
కల కరిగింది కళ్ళ ముందే - అశ్రుధారలే మరి కళ్ళనుండి
ఎప్పుడూ అంతే నగరజీవితం , పల్లె జీవితం భిన్నధృవాలే!
ఒకరికి ఆనందం మరికరికి విషాదం
ఇది కాలం చేసే మాయాజాలం!! ***

## ఒక అందం పుట్టినరోజు
## కుమారస్వామి

**ఆకాశం అమృత వర్షం కురిసిన రోజు**

నేలంతా ప్రకృతి రంగవల్లికలు అలిమిన రోజు

సంద్రంలో ముత్యాలన్నీ, ఆణిముత్యాన్ని చూడాలని పైకొచ్చిన రోజు

ఉషాకాంతులన్ని నీ కంటి వెలుగైన రోజు

చిరుగాలి నీ ముంగురులు తాకి మురిసిన రోజు

పంచభూతాలన్ని పులకించి నిన్ను స్వాగతించిన రోజు

అందలం నీకు ఊయలైన రోజు

అందం అనే పదానికి అసలైన నిర్వచనం దొరికిన రోజు!!

## కొంగుబంగారం
## నెల్లుట్ల సుదర్శన్ రావు

**చంటాడి కంటి నీలాలకు అమ్మ కొంగు ఆధారం**

చంటిదాని జలుబు నాసికకు ఆసరా అమ్మ చెరుగు !

నాన్నారి తడి చేతులకు అమ్మ కొంగు జేబు రుమాలు

వేడి పెనం దించడానికి కూడా

అలుసు కదా అమ్మకొంగు !!

తన కన్నీటిని తుడుచుకోడానికి

అమ్మకు కూడా , అమ్మకొంగే ఆధారం !!!

వెరసి;

అమ్మకొంగు, బంగారం

అమ్మే ఓ కొంగుబంగారం ప్రతి ఇంటికి !



# రసరేఖలు

శ్రీధర్ బచ్చోటి

**నన్ను విడి నీవు వెడలిన నాటినుండి**
హృదయమున తేజమెచటికో కదలిపోయె
ఎడదలోపల వెలుపలనిరులు నిండె
తేజమును నించు ప్రేమ యదృశ్యమయ్యె

వెడలిపోయిన నీతోడ వెడలెనేమొ
గుండె లోతుల దాచుకొన్న ప్రేమ!
వెడలినది ప్రేమ కాదది ప్రేమ ఫలము
ప్రేమలోనుండి పుట్టిన వెలుగు రేఖ

కాంతి రేఖలు వెడలి చీకటులు నిండె
వలపు దీపమ్ము కొడిగట్టి వత్తి మిగిలె
తిరిగి దీపము వెలిగి ప్రజ్వరిలునెపుడు?
ఇచట నిండిన యిరుల జయించునెపుడు?

నేను తలచితి నీవు నా దానవంచు
ఎపుడొ వత్తువు తిరిగి నాయింటికంచు
ఆశలన్నియు తుదకడియాసలైన
ఎపుడు నాదానవైతివో యెరుగలేను

ఆరిపోయిన దీపంపునార్తి యనగ
ఆవిరై సాగె బాష్పమ్ములభ్రమునకు
కనుల వెలుతురు లేక చీకటులు నిండి
ఆత్మ నిలచెనిచ్చోట దేహమ్ము వెడల

# నేను..

వీరేశ్వరరావు.ఎమ్.

**నిన్ను మోసి**
నీ ప్రతిరూపాన్ని మోసి
నీ ఇంటిపేరుని మోసి
మోతల్లో 'వైఫాఫ్'గా మిగిలిన వ్యథా వనితను నేను!
బంధం క్రాస్ మిద
శిలువ వేయబడ్డ బందీని
ఫత్వాల వెనుక
పరదాల వెనుక
పగిలిన హృదయాన్ని నేను!
ఆక్వేరియమ్‌లో ఒదిగిపోయి
ఒడ్డు మరిచిన రంగుల చేపను!
తల్లివేరు ఖండించబడి
కొమ్మలు కత్తిరించబడి
కుండీలో ఒదిగిపోయిన
'బొన్సాయ్'ని నేను!
నిఘంటువులలో మిగిలిన
నామ మాత్రపు స్వేచ్ఛను!
తరాల తలారి చేతిలో
మనువు సూత్రాలు
మంగళ సూత్రాలు
మగాడి సూత్రాలు
ముప్పేట ఉరిగా మారి
ఆత్మను పోగొట్టుకున్న
అతివను నేను!!

***

# హృదయవీణ

డా.సంధ్యారాణి కొండబత్తిని





**ఉరుకుల పరుగుల జీవితంలో**
యాంత్రికత ప్రపంచీకరణలే నిత్యస్వరాలు
జీవన ప్రవాహంలో బంధాలు బలహీనాలు
అన్నీ(పై) పై బంధాలు!
మానవ సంబంధాలన్నీ మనీతో ముడిపడ్డాక
ఉమ్మడి కుటుంబాల జాడలు లేవు
కనీసం 'నా నీడ నా తోడు' అనటానికి
సూర్యుడికి మన ఎత్తైన భవనాల గోడలు అడ్డు
గదులకే కాదు గోడలు మనసులకూ కట్టేశాం
మమతల్ని మానవ సంబంధాల్ని సమాధి చేసేశాం..
బిజీ బతుకుల్లో వారాల పసిగుడ్డు తల్లి స్తన్యానికి దూరం
ఉలిక్కిపడి నిదురలేచిన రాత్రులు
పక్కలోసాఫ్ట్ టాయ్స్ తప్ప అమ్మ స్పర్శలు లేవు
కిండర్ గార్డెన్లో అమ్మమ్మ తాతయ్యల చందమామ కథలు లేవు
రెక్కలరిగేలా చాకిరీ చేసి సాకిన తల్లిదండ్రులకు
వృద్ధాశ్రమమే బ్రతుక్కి చరమాంకం!
సాయంకాలపు వీధి అరుగుల రచ్చబండల సమావేశాలు ఇప్పుడు లేవు
గదిలో మనల్ని మనం బంధించుకొని 'ప్రైవసీ' అంటున్నాం
నవ్వడానికి లాఫింగ్ క్లబ్బులు వచ్చాకే తెలిసింది
మనం మనసారా నవ్వడం మరచి చానాళ్ళయిందని!
పెర్సనాలిటీ డెవలెప్మెంట్, కౌన్సిలింగులు -
వీధికొక్కటి పుట్టుకొచ్చాకే తెలిసింది
మానవసంబంధాలు మసకబారాయని!
మూగబోయిన హృదయవీణపై మానవ సంబంధాలలోని
శాశ్వత విలువలను రాగాలుగా పలికించాలనుకున్నా
గతులు తప్పిన సంగతులను శ్రుతి చేయాలనే ప్రయత్నంగా!

*****

# గుల్జార్ పాట
## మధు పెమ్మరాజు

**ఆయనకి మనసే ప్రకృతి**
అంతరంగాలకి
అరుదైన సున్నితత్వం,అందమైన పదకోశం కలిపితే
అది గుల్జార్ పాట!

నిరీక్షణలో అర్థం లేని ఆశ
విషాదంలో తీపి అనుభూతి
ఇరుకు సందుల్లో దొరకని సమాధానం
ఆగిపోయిన రహదారుల్లో ఒంటరితనం
మలుపు తిరగని నిజం గుల్జార్ పాట!

ఎక్కడో కొండల్లో విన్నట్టు
గుండెల్లో వింత ధ్వని, ఓ ఎకో
మనని  వెంటాడితే, వదలనంటే
మనసు లోతుల్ని చిలికించి ప్రశ్నిస్తే
బదులు చెప్పమంటే
ఓ కంటి చుక్క, తెలీని అనుభూతి
అంతులేని ఉద్వేగం కలిగితే ఆ పాట గుల్జార్ పాటే
పాటే కాదు ఆయన మాటే చాలు!
****

# వివేకి
## అలజంగి ఉదయకుమార్

**సుఖమైన దుఃఖమైన నలుగురితో పంచుకో**
మమతాను రాగాలతో నీ వాళ్ళుగా పెంచుకో

కోరుకున్న నాడే కాస్త వివేకం ఉండాలి
కాయేదో పండేదో చూసి మరీ తుంచుకో

కడదాకా సాగాలనె తపన నీలో ఉంటే
పనికిరాని బంధాలను పురిటిలోనే తెంచుకో

వినేవాళ్ళు దొరికారని ఊదేయకు భారతం
బాధలేవో ఉంటే అవి నీలోనే ఉంచుకో

పనివాడు పందిరేస్తే పిచ్చుకేమో తోసిందట
పనిచేసే చోట నీ ఒళ్ళుకాస్త ఒంచుకో

'ఉదయా' న్నే పిజ్జా బర్గర్‌లంటూ గడ్డితిని బ్రతకకూ
చద్దన్నంతో ఓ చల్ల మిరప నంచుకో
***



# రసరేఖలు

శ్రీధర్ బచ్చోటి

**ఇది దినాంతకాలము - ప్రజలెల్ల యలసి**
ఇంటి మార్గము పట్టి తామేగు వేళ -
తరలు వాహనములు రహదారులందు
తగ్గనలికిడి గృహముల దారులందు

**పడమట తరణి బింబమ్ము వాలుచుండ**
నెమ్మదిగ వెల్గురేఖలు నిష్క్రమింప
కారుమేఘమ్ములెల్లెడ క్రమ్ముచుండె
బయట చీకట్లునిండ్ల దీపములు తోచె

**చిటపటమనుచునిలదాకు చినుకులెన్నొ**
ఎడతెరిపి లేక రేయెల్ల సడిని చేయు
ఇంటిలోనుండ బయట ప్రకృతిని గనము
ద్వారములు మూయ వాన సవ్వడులు వినము

**ఆర్పివేయుము దీపమ్ములన్ని నీవు**
సరిగ విందుమో చెలి! వాన చప్పుడులను
ఈ నిశీధియందీ జడివాన వేళ
ప్రకృతి సడి తప్ప వేరేమి వలదు మనకు

**వెలుగు వీడ్కొని చీకటి విడిది చేయ**
కనులు విశ్రమించి మనసు కనులు తెరచు
శ్రవణముల దాకు బహుదూర రవములైన
ప్రకృతి నాదమ్ములెదకు వారధిని గట్టు

# మాసిపోయిన తొలిసంజె

తమ్మినేని అక్కిరాజు

**కావలసిన దానికోసం అరచి గీ పెట్టడం**
వద్దన్న దానిని విసిరి కొట్టడం
క్షణాలలో చర్య, ప్రతిచర్య
ప్రతిక్షణం వర్తమానంలో
భూత భవిష్యత్తులతో పనిలేదు
వెలిగిపోతున్న ముఖారవిందం
అనుక్షణం ఆనంద లోకాల విహారం
మెదడు చెప్పినట్టు 'నేను' చేస్తానా
'నేను' చెప్పినట్టు మస్తిష్క విహారమా!?
ఈ 'నేను' అంటే ఎవరు?
ఎంత స్వేచ్ఛ! ఎంత విజయానందం!
నేను చెప్పినట్టు అందరూ వినాలి
అమ్మ, నాన్న, తాత...నా చుట్టూ..
నాకు కావల్సింది అందిస్తూ
నా ఏడ్పులు, నా నవ్వులు , నా చిలిపి చేష్టలు
కోపం వచ్చినా, ఆస్వాదిస్తూ
ముద్దు మాటలతో పొద్దు పోనిస్తూ
నేను నిద్దుర పోయే వరకూ నా చుట్టూనే!
నాదొక పసి సామ్రాజ్యం
బాల్యపు సింహాసనం!
మహరాజునై పాలించినంత కాలం
గుర్తొచ్చినప్పుడల్లా అనిపిస్తుంది.!
నా కోసం నా ఆజ్ఞకోసం
పడిగాపులు కాసిన వారంతా ఏరి?
ఆ కాలాన్ని ఎవరు దొంగిలించారు? ***

# వీడుకోలు

మధు పెమ్మరాజు

**చెయ్యూపితే తెరగా కమ్మేసింది కన్నీటి చుక్క**
గొంతు దాటదు చివరిమాట
ఈ దూరాలు ఎంచుకున్న దారులని తెలిసినా
ఏదో తెలియని భయం, నిస్సత్తువ!

చలనంలేని శిలనై కదులుతున్న నా మనసుని చూసా
ఉబికొచ్చే భావాలతో నా నీడని చూసా
ఏమీ పట్టని గడియారపు ముల్లు కదులుతోంది
మొద్దుబారిన నా ఆలోచనల్ని చూసి నవ్వుతోంది
అది వీడ్కోలు కాదు, నాలో మొదలైన నిరీక్షణ!

తోడులేని అడుగు ఇంటి దారి చూపితే స్తబ్దతతో కదిలా
అలవాటులేని నిశబ్దంలో వల్లె వేసిన పలకరింపులు
పెదవి దాటని అంతరంగ తరంగాలు కొత్త నేస్తాలు!

యాంత్రికంగా తలుపు తెరిస్తే
ఒంటరితనం పొగ మంచులా కమ్మేసింది
వాస్తవం వెలితి నింపినా
నీ వెంటాడే నవ్వులు వింటూ వేచి ఉంటా
నీకోసం, నువ్వు రాబోయే రోజు కోసం!!

*****



# ఆలోచనాలోచనాలు

## ఎస్.కె.వి.రమేష్

**మెరుపు దారం**

ఆకాశానికి హారమేద్దామంటే
చిక్కకుందా మెరుపు దారం
అంటూ అరుస్తోందా ఉరుము.

*******

**శ్రోతలు**

పాడడం ఇంకా మొదలే పెట్టలేదు
కానీ అప్పుడే శిరసులూపే
రసికులైన ఎందరు శ్రోతలను
సంపాదించిందో చూడా గాలి
ఈ పంట చేలో.

******

**పక్షపాతం**

ఎవ్వరి మీద ప్రేమ లేదని
ఇన్నాళ్ళుగా చెప్పుకొస్తున్న నాకు
పక్షపాతాన్ని అద్దేసారా రైతులు, ఈ నేతగాళ్ళు కలసి
అని వాపోతోందా మృత్యువు.

******

**కాలం**

తనకెంత వయసు మళ్ళినా
ఇంచుకైనా మధుమేహమబ్బలేదని
ఎందరి జీవితాల్లో
మధువుని తాగేస్తోందా కాలం.

******

**ప్రశాంతత**

అలజడి కూడా
మనసుపడేంత
అందమైనదా ప్రశాంతత

******

# కాలం మారింది

## తమస్విని

కాలానికి కోపం వచ్చింది
దాన్నెవరూ పట్టించుకోడం లేదు పాపం
వానాకాలం ఎండాకాలం శీతాకాలం అనడం లేదేవ్వరూ
ఎలక్షన్‌కాలం, క్రికెట్‌కాలం, కొత్త సినిమా రిలీజ్ కాలమే కావాలి అందరికి
అవేం కాలాలో తెలియక కాలం బిత్తర పోయింది
వీళ్ళకి ఇదేం పోయేకాలం అని మండి పడింది
నువ్వెంత గొప్పయినా కాలాతీతుడివి కాదురా మనిషీ
అని కాలం కలవరం చెందింది
ఏమి చేస్తాం కలికాలం అని చివరికి రాజీ పడింది ..!!

******



# జీవనది డా.నారాయణ గరిమెళ్ళ

**ఆమె ఒక ప్రవాహం, అతడు మరొక ప్రవాహం**
రూపాలు వేరు వేరు.
నీళ్ళ రంగులూ వేరు..

ఒకదానికి తెలియకుండా మరొకటి
ఎంతలేసి దూరాలో
ఎన్నాళ్ళనుండో
ప్రయాణిస్తూ వచ్చివచ్చి
ఒక్కసారే ఒకటైపోయాయి.
అప్పుడే, నదిమొదలయ్యింది.

ఉపనదులనుకున్న రెండూ
క్రమంగా
క్రమక్రమంగా
కనుమరుగైపోయాయి

ఇప్పుడు, ఎప్పుడుచూసినా
నది నాట్యమాడుతున్నట్టే అనిపిస్తోంది

కొంతదూరం పాటు,
కనీకనిపించని రంగుల తేడాలో
వడిఉధ-కృ తులో పరిశీలించాక,
నదిలో ఈ పాయ ఆమె
ఆ పాయ అతడు
అని గుర్తుతెచ్చుకొని చెప్పాలనిపించేది.

కానీ, శిరోసంపదకి జెడ అల్లినట్టు
ముందువెనకలై వెనకముందులై
సమ్మిళితమై
ఏర్లు రెండూ దోబూచులాడుకుని
ఒక్కసారిగా, పరిపూర్ణ జీవనదిగా ప్రాణమయ్యాయి.

కాలప్రవాహంలో,
నదిమధ్యలో సంతానపాయొకటి పుట్టుకొచ్చి
మరింత సొగసును సొబగును
ఆహ్లాద పరవళ్ళను తీసుకొచ్చి
తనూ నదిలో భాగమైపోయింది.

జీవనదికదా
ఎప్పటికీ జీవకళను ప్రవహిస్తూనే ఉంటుంది.

సశ్యశ్యామలాలు
నదుల అనుసంధానాన్నో,
జీవనదుల పుట్టుకనో
ఆశించడంలో తప్పేముంది? ఆశ్చర్యమేముంది? ***



# రసరేఖలు

## శ్రీధర్ బచ్చోటి

**పవలు రేయియు ప్రేమ పూబాట యందు**
నడచిపోవుచునుందు తన్మయము మీర
కనులు తెరువగ కలలన్ని కరిగిపోయి
వెడలుచుందు పురము నడివీధి యందు

**కలలలో వినువీధి యంచులను దాటి**
జీవనమ్మున గమ్యమ్ము చేరనైతి
ఎగిరి విహగమ్మునై యెంత యెత్తు చేరి
అందజాలిన కొమ్మలనందనైతి

**వరవసంతాన పికమునై పాడుచుందు**
రాగమన్నది తెలియని బ్రతుకు నాది
నభమదెల్లను చిత్రవర్ణముల నింతు
వెలవెలలు బోవు నాదు జీవితపు పటము

**ఎందరో విజ్ఞుల కడనెన్నెన్నొ నేర్చి**
ఇలను మనుగడ యేలనో తెలియనైతి
అన్ని దైవతమ్ముల మనసార కొలిచి
మనసు లోపలనేమూర్తి కనగనైతి

**అతులితానందమేది జీవితమునందు**
బడయ గల్గినదొక్క స్వప్నములలోనె
జీవితము నిల్చి యూహాల సీమలోన
విడిది చేసెడు క్షణముకై వేచి యుందు

# గింజుకునే అక్షరం

డా.కె.గీత

**రాత్రి కిటికీ దగ్గర కూచున్నాను ఏదో రాయాలనిపించి**
బయటెక్కడా కుక్కల అరుపుల్లేవు
మిణుగుర్ల జాడే లేదు
పిల్లల ఏడుపుల్లేవు
టీవీల గోల లేదు
అంతా నిశ్శబ్దం
పుప్పొడై రాలుతున్న నియాన్ లైట్ల కాంతి పుంజపు నిశ్శబ్దం
రాద్దామని కూచున్నానా కలం కదిలే ఆలోచనల్లేవు
పెన్నులో ఇంకైపోయినట్లు మనస్సు తడారిపోయింది
కంట చుక్కజారని కరడు వర్తమానమైపోయింది
అయినా ఏదో తపన
రాయాలి రాయాలి
నేను బతికున్నానని నాకు తెలిసేందుకైనా రాయాలి
అందుకే నిశ్శబ్దాన్ని ఛేదించి
శబ్దాలు ఎగిసిపడే ప్రపంచంలోకి
కిటికీ నొదిలి
నిద్రిస్తూనే ప్రవేశించాను
సంవత్సరాల తరబడి  తిరుగుతూనే ఉన్నాను
నా చేతిలో తెల్లకాగితం రెపరెప లాడినప్పుడల్లా
కాస్త జ్ఞాపకాల గంధం చల్లుకుంటే గానీ కలం నడవదు
బతుక్కి కాస్త ఆనందం మిగలదు
రాత్రి అయిపోవచ్చింది
త్వరగా నిద్రించాలి
కాదు కాదు త్వరగా వెనక్కు రావాలి
అయ్యో ఖర్మ!
నిద్రా
మెలకువా
రాతా?
కోతా!
కళ్ళు విప్పమని బలవంతంగా భుజాలు పట్టి కుదుపుతున్న
కవిత్వం
ముసుగు పెట్టి తన్నే కాస్త మురిపాల రాత్రిని వదల్లేనితనం
గింజుకున్నా
రాని అక్షరం
లేని మోక్షం
క్షమించు మిత్రమా! నీకెప్పుడో ఏటొడ్డున చేసిన ప్రమాణం
ఈ రాత్రికి ఇక ఆఖరు !!

***

**సెప్టెంబర్ 9న, బే ఏరియాలో జరిగిన 'వీక్షణం' సాహితీ మిత్రుల సమావేశంలో చదివిన కవిత**

# తపన

## రాధిక బిక్కా

**మంచు పూలు నేలని ముద్దాడే**

చల్లని ఓ ప్రభాత వేళ
విరజాజులు విరబూసె
వెచ్చటి ఓ రాత్రి పూట
నీ ఎదపై తలవాల్చి ఊసులెన్నో చెప్పాలని కోరిక
రుసరుస లాడె నీ వదనం
శపిస్తున్నట్టు వచ్చే నీ మాటలు
ఆ కోరికను గుండె మూలల్లోకి నెట్టి సమాధి చేసేస్తాయి.....

తెలియని ఆనందమేదో మనసుని
పరవశింపచేస్తున్న సమయంలో
ఉల్లాస వీచికలతో
హృదయం ఉపశమిస్తుంటే
ప్రియమైన అనుభూతులు నీతో పంచుకుందామనుకుంటా...
నిర్లక్ష్యంగా నువ్వు చూసె చూపు...
కృత్రిమంగా నవ్వే నవ్వు....
నా అనుభూతులను అగాధంలోకి తోసివేస్తాయి...

***



## పొలం చెంతన హలం చింతన

దోగిపర్తి రఘు రామచంద్ర మూర్తి

**వద్దురా వద్దురా ఆత్మహత్యలు వద్దురా రైతు సోదరా!**

ఫలం నిచ్చే పొలం చెంతన హలం నీవు త్రాగకురా !
కాయ నిచ్చే చెట్టు కొమ్మకు ఎండుటాకై రాలకురా !
నాగలి పట్టిన చేతులతో నరం నీవు తెంచుకోకురా !

బలం తోటి భూమి చీల్చి విత్తు నాటిన తమ్ముడా
బాధతో నీవు భూమి అడుగున నిదురించకురా !

పొట్ట కూటికి పొలం దున్నే పొగరుబోతువు కాదురా
పరుల కోసం ఫలం పంచె మంచి మనసే నీదిరా !

కోత కోసే చేయి నీది నిన్ను నమ్మిన
ఆడ కూతురి గుండె కోతవు కాకురా !

నేల తల్లిని దున్ని నీవు తల్లి ఋణమును తీర్చరా
నీవు నమ్మిన నేల తల్లి నిన్ను వమ్ము చేయదురా !

మట్టి నీకు మంచి గంధం
మరచిపో ఈ మరణ మృదంగం ***

## మరీచిక ఏరువాక

నెల్లుట్ల సుదర్శన్ రావు

**అవన్నీ కాగితాలపైనే**

రైతే రాజు, దేశానికి వెన్నెముక !
జై కిసాన్ చూపు మాత్రం
దశ దిశల వైపు;
మబ్బులు కమ్మితే చాలు':
మహదానంద పడిపోతాడు ,
చెరువులు నిండినట్లు,
చేలు పండినట్లు !!
శాస్త్ర సాంకేతిక విజయాలు
గగనాలకు పాకినా,
కర్షకుడు మాత్రం
కరిమబ్బుల దయ కోసం
దిగంతాలకు బెదురు చూపు !
మరీచికలాయెను, మాయదారి వానలు !!

***



# నే తొక్కేసిన నా అంతరాత్మ మాధవ తురుమెళ్ళ

**హఠాత్తుగా నిద్రలేచి**
**నాతో విభేదిస్తున్నానని పలికింది నా అంతరాత్మ!**

అవును నేను విభేదిస్తాను...

కలలు సాకారాలుగా చేయాల్సిన నీవు
సముద్రంలోంచి లేచిన అలలుగా
చేపట్టినపనులన్నిట్నీ వెనక్కి తిప్పి పంపినప్పుడు నేను విభేదిస్తాను...

కాలకరాళ కర్కశ దంష్ట్రల్లో చిక్కుకుని
దైన్యత వస్త్రంలో తమ ముఖాలను తామే కప్పుకుని
తలదించుకుని తమ బతుకులింతే ననుకుని
బలిపీఠానికి మూగగా నడిచివెళ్ళే జంతువుల్లా
ఈ మనుషులు నడిచే దారిపొడుగునా జిల్లేడుపూవులా పూస్తున్న దరిద్రాన్ని
నీవు పట్టించుకోకుండా
దేవుడి ఉత్సవాల్లో పానకాన్ని తాగుతూ
తలవంచుకుని నిలబడినప్పుడు నీతో నేను విభేదిస్తాను....

ఈ మనుషుల దైన్య ప్రపంచాన్ని
నిర్దాక్షిణ్యంగా, కర్కశంగా కబళిద్దామని
వీళ్ళను నిలువునా తిందామని, వీళ్ళలో విషం కక్కుదామని,
కాచుకు కూర్చున్న అవకాశవాదులు ,
దళారులు, రాజకీయనాయకులు
సాలెపురుగుల్లాగా అల్లిన బూజులో
వీళ్ళు చిక్కి చేస్తున్న ఆర్తనాదాలు గమనించకుండా
భగవంతుడికి జలతారు బట్టలుపెట్టి
తలవంచుకు నిలుచున్న నీ నమ్మకంతో నేను విభేదిస్తాను...
తన గర్భంలో దాగిన దావానలాన్ని అక్కసుతో పెఠిల్లున కక్కిన

అగ్నిపర్వతం రక్కసి చేష్టల్లో అంటుకున్న బూదిలాగా
వీళ్ళను కప్పుతున్న మాయను వీళ్ళకు అగుపించని లోకాన్ని పట్టించుకోకుండా
నీవు అగరొత్తుల పొగలను దేవునికి చూపించి
వీళ్ళ  ఉనికిని  పొగల్లో నీకు కనిపించకుండా చూసుకుంటున్న నీతో నేను విబేధిస్తాను..

వీళ్ళు  నివసిస్తున్న జనారణ్యాలను అంటుకుంటున్న దావానంలాంటి అరాజకత్వాన్ని
చూడలేకో, మూలిగే మనసును సమాధాన పరచలేకో
కళ్ళు రెండిటినీ నెత్తిన అతికించుకుని
పగలు రాత్రీ ఆకాశాన్నే చూసే
నీ భావుకతని నేను విభేదిస్తాను...

నీ తలను ఆకాశంలోనో ఆలోచనల్లోనో ఐన్స్టీన్ థియరీ ఆఫ్ రిలేటివిటీలోనో
మార్క్సిజంలోనో మావో ఆలోచనా విధానాల్లోనో ఎక్కడో దాచేసావు...
నీ సోదర మానవుల కాళ్ళు  కూరుకుపోయి ఉన్న బీదరికపు బురదని పట్టించుకోవు

అందుకే నీతో విభేదిస్తాను...

అంటున్న నా అంతరాత్మ బాధను పట్టించుకోలేక
ఓ దిండులో నా మొహాన్ని కప్పుకుని
నా అంతరాత్మని ఎక్కడో తొక్కేసాను...   ****



# లెక్కలు అప్పుడు ఇప్పుడు

కర్లపాలెం హనుమంతరావు

1/-1

**చిన్నప్పుడు**

**లెక్కలంటే భలే సరదా నాకు**

కూడికలంటే చేగోడీలు తిన్నంత ఇష్టం

తీసివేతలు పచ్చిబాదం కాయల్లా వగరు

ఇప్పుడో

తినే ముందు తీసేయక తప్పని బెడ్డలు తీసివేతలు

కూడికలంటే తేలికే కానీ  తెలీని అదో చిన్నచూపు

అంకెలు అప్పచ్చుల్లా నోరూరించేవప్పట్లో

సంఖ్యల్లా వాటిని పెంచమంటే

ఖాళీఅగ్గిపెట్టల్ని రైలు బండిగా మార్చడమంత  హుషారు

ఇప్పుడో

ఏ చుట్టం కంటపడ్డా

పక్కిట్లో నుంచి అప్పుతెచ్చుకోడానికొచ్చిన

చిన్నంకెను చూసినంత  చిరాకు

2x1=2

2x2=4

ఎక్కాలు పైకీ కిందకీ .. కిందకీ పైకీ గుక్క తిప్పుకోకుండా

వప్పచెప్పక పోతే పడేది

వీపుమీద  మాస్టారి పిడిగుద్దు

మా ఐదో అంతస్తు ఫ్లాటుకు

ఇప్పుడెన్నివందల సార్లు ఎక్కిదిగుతున్నానో చెప్పద్దు

3x3=9

హెచ్చవేతలంటే చెయ్యి వెచ్చబడేదే గానీ

చేస్తున్నకొద్దీ ఉత్సాహం రెట్టింపయ్యేది

మొక్క చెట్టవడానికి పాదుల్లో నీళ్ళు పోస్తున్నంత ఉల్లాసం

పిచ్చి వయసది - ఇప్పుడో !?

బ్యాంకుడబ్బు వడ్డీలెక్కలప్పుడు తప్ప గుణకారమంటేనే వళ్ళుమంట

1033/7

భాగహారం చెయ్యాలన్నా  భలే భయం బాబూ ఆ రోజుల్లో!

పదొందలముప్ఫై మూడులో ఏడు ఎన్ని  సార్లు పోతుందో తెలీక

ఏడుపు

సున్నా శేషంగా వచ్చిందా

పరుగుపందెంలో కప్పుగెల్చినంత ఆనందం

పదహారు నుంచి  అరవైఆరునైనా సరే

ఎన్ని సార్లయినా పంపించగల గడుసుదనం ఇప్పటిది

0

సున్నా అంటే ఏమీలేదనుకునే

అమాయకత్వం ఆ చిన్నతనానిది.

సున్నాలోనే అన్నీ వున్నాయని

అర్థమయిన పెద్దమనిషిత్వం ఇప్పటిది.

లెక్కలంటే మేథకు తొడిగిన రెక్కలు ఒకప్పుడు

లెక్కలంటే కాకులైనా చేయగల ట్రిక్కులు నాకిప్పుడు

***



# రసరేఖలు
శ్రీధర్ బచ్చోటి

**వెడలిపొమ్ము చెలియ! నను విడచి నీవు**
ఎచటికో నీ మనసు పయనించు వైపు
తెలుప పనిలేదు నాకు నీ తీరమేదొ
తిరిగి చూడగ మరల యత్నింపవలదు

**నాదు గుండెల నిండు విషాదరేఖ**
నా మనస్సున మ్రోగు దైన్యప్రఘోష
నీ కొరకు సాగు నాదు కన్నీటి వాగు
అడ్డు రానీయకుము నీ ప్రయాణమునకు

**కడిగినది హృదయమును నా కంటి నీరు**
ఎదురు దెబ్బలు మార్గమ్మునెరుక జేసె
మింట మెరుపులాగి యొసగె కంటి చూపు
శబ్దమాగి వినిపించె నిశ్శబ్ద గీతి

**ఈ వ్యథాబ్ధి మునిగి మరణింతునంచు**
తలపగా వలదిది యమృతమయ సీమ
అనలకీలల షట్పదమ్మగుదునంచు
ఎంచబోకుము శీతప్రపంచమిద్ది

**ప్రేమ కోల్పోయి యెట్లు జీవింతునంచు**
చింత వలదు ప్రేమరహిత సీమ యిద్ది
రాగమును ద్వేషమును దరిరావు నాకు
నిశ్చలానంద శాంతమందిరము నాది

## ప్చ్.....
ప్రతాప వెంకట సుబ్బారాయుడు

**సుప్రభాతాలు..నైవేద్యాలు**

పవళింపు సేవలూ సాగడానికి
నేనేం భగవంతుడ్ని కాను,
నా ప్రతి కదలికా
ఓ సంచలనం కావడానికి
ట్విట్టర్ లో నా ప్రతి ఫీలింగ్ పంచుకోడానికి
నేనేం సెలబ్రిటీని కాను,
నా ప్రతి మాట పేపర్లో రావడానికి
దానికి ప్రతిపక్షం ఉద్రేక పడిపోడానికి
అవినీతి పరుడినని, ఆశ్రిత పక్షపాతినని
అందరూ ఆడిపోసుకోడానికి
నేనేం రాజకీయ నాయకుడిని కాను,
ఎక్కడ క్యూ ఉన్నా నుంచోడానికి
జనాభా లెక్కల్లో పేరుకి
ఓటర్స్ లిస్టులో చోటుచేసుకుని ఓటెయ్యడానికి
అంతే...నా అస్తిత్వమంతే!
భగవంతుడికి భక్తులుండాలి
సెలబ్రిటీలకి అభిమానులుండాలి
నాయకులకి అనుచరగణముండాలి
అప్పుడేగా వాళ్ళు గుర్తింపబడేది
అయినా..వాళ్ళకే గుళ్ళూ గోపురాలు.
చౌరస్తాలో విగ్రహాలు..
జయంతులూ..వర్థంతులూ..ప్చ్..!

***

## ప్రేమించు
వీరేశ్వర రావు . ఎమ్.

**ప్రేమించు**

జీవించి ఉండగా ప్రేమించు
శ్వాసిస్తున్నంత స్పష్టంగా ప్రేమించు!
ప్రేమకు తర్కమే కాదు
తూనికలు, కొలతలూ లేవు
ప్రేమసూత్రం ఇవ్వడమే!
ప్రేమలో లీనమవ్వడమే!!
ప్రేమను పంచు
ప్రేమగా ప్రవహించు
పంచడంలో ఇతరులను మించు!
ప్రేమ ప్రారంభం నీ హృదయమే!
ప్రేమలేని హృదయం శిశిర నిలయమే!
ప్రేమ
ఆకాంక్షలు లేని
శశాంక రేఖ!
ప్రేమ దక్కలేదని ద్రావకాల జోలికి పోకు!
ప్రేమించడమంటే స్వేచ్ఛను గౌరవించడమే!
నిర్వచనాల్లో, నిఘంటువుల్లో
దొరకదు ప్రేమ
ఉదయాన్నే విరిసిన మందారం
చెబుతుంది దాని చిరునామా!

***

# అదృశ్య శక్తి

## మనస్విని

**నవోదయాన ఉత్సాహాన్ని నింపే అరుణకాంతివై**

నిశా ప్రపంచాన  తమస్సును పటాపంచలు చేసే సంధ్యా దీపానివై

గ్రీష్మానఒడలు సేదదీర్చే మలయ మారుతానివై

పుడమి తల్లిని పులకరింపజేసే తొలకరి చినుకువై

ప్రకృతి వనాలకు సప్తవర్ణాలు పులిమే వసంత ఋతువై

వినీల గగనాన విహంగాల రెక్కలకు ఊతమిచ్చే పవనానివ

హృదయవీణ ను పలికించే నవరాగ వర్ణమై

అను నిత్యం మానవ మనుగడకి ఒకప్రేరణవై

నిరంతరమై, నిర్గుణవై, నిరాకారమై

నిశ్చలమై, ఒక ఊహవై, ఒక శక్తివై

సచ్చిదానందమై పరిఢవిల్లే నీకు ప్రణమిల్లుతున్నాను!

***



## అశ

## పి.వాణి

**మహానగరాల్లో కాదు నీ ప్రతాపం**

మండుతున్న అవనిపై కురిపించు,

రగులుతున్న అగ్ని శిఖను చూడు

బోరుబోరున విలపించు,

చినుకు చినుకుగా కాదు

వెల్లువై వర్షించు,

కొండకోనల్లో దారి తెలియక సంచరించే

ఎండిపోయిన గుండెల్ని చిగురులు తొడగనీ!

ఆకలి అర్తనాదాలు ఆశగా చూడనీ!

ఎండిన దేహంతో సిగ్గుపడుతున్న పుడమిని

పచ్చని చీర కట్టుకోనీ!

బోసిపోయిన ప్రకృతికి

రంగుపూలు అద్దనీ!

ప్రళయాలు కాదు - నీ విలాసాలు చూపించు

చల్లగా మెల్లగా తరతరాలు నీ వరాలు కురిపించు!

***

## సంగీతం

## యామిజాల జగదీష్

**సంగీతం నాదవినోదం,**

ఆత్మతో మాట్లాడే అంతరంగ భాష,

గాయకుడు శబ్దాన్ని చిత్రంగా సాక్షాత్కరింపచేశాడు

దాని శీర్షికే సంగీతం!

సంగీతం

చెవులకు కప్పే

సన్మాన శాలువ!

సంగీతాన్ని

భూమిపై కనుగొన్న

శాస్త్రవేత్త గాలి!!

చెట్టులోని ప్రతి కొమ్మారెమ్మా

తలలూపుతోంది

భూమి కిందవేళ్ళు

వేణువులూదుతున్నాయి కాబోలు!

సంగీత ప్రవాహంలో

కొట్టుకుపోతున్న ప్రతిసారీ

నేను తీరం చేరుతున్నానంటే

ఈ చెవులకి ఈదడం తెలుసు కనుకే!!

***



# గడియారంVS గుండె

డా.కె.గీత

**నన్ను చూసి గడియారం వికటాట్టహాసం చేసింది**
అంతా ఎటో వెళ్ళిన అపరాహ్న వేళ ఎర్రని డిజిటల్ కళ్ళేసుకుని
ఉరుమురిమి చూసింది
నా చుట్టూ జ్ఞాపకాల సైకత శిల్పం పొడై రాలుతున్న నిశ్శబ్దం
టకా టక్ -టకా టక్ -
బతికుంది సుమా  గడియారంతో బాటూ గుండె
సమ ఉజ్జీగా పరుగెడుతోంది!
ఎక్కడిదో ఓ ఉత్తరం
పుస్తకం పొట్టలో జీర్ణం కానట్లుంది,
వీపు తట్టగానే బైట పడింది
గడియారాన్నీ  గుండెనీ గిర్రున వెనక్కి తిప్పింది
గదంతా గుండ్రంగా తిరిగి మళ్ళీ అక్కడే ఆగింది
గడియారం కవాతు-
టకా టక్ -టకా టక్ -
నిమిషాలు యౌవనం మీంచి చేజారి పోతున్న వేగం
గడియారం ముందుకీ   గుండె వెనక్కి-
జ్ఞాపకాల్లో  ముక్కు ముంచి గతాన్ని తాగి
మత్తుగా నిద్రపోతోంది-
గడియారం Vs  గుండె
కవాతు- కవాతు-
వెనక్కెనక్కి- సమ ఉజ్జీగా పరుగెడుతోంది

***

**అక్టోబర్ 14 న, బే ఏరియాలో జరిగిన 'వీక్షణం' సమావేశంలో చదివిన కవిత**

# రసరేఖలు

## శ్రీధర్ బచ్చోటి

**ఎక్కడుంటివి ప్రియతమా యీ దినమ్ము?**
ఎక్కడో తెలియని రోదసీతలాన
కనులకందని యేదియో గ్రహమునందు
సుందరగృహాన వసియించుచుందువేమొ!

**ఎక్కడుంటివి నా చెలీ యీ క్షణమ్ము?**
ప్రాణసఖియలతోడ యే వనమునందొ
ముచ్చటించుచునుందువో ముదము మీర
అలరుబాలల చెంత కోయిలల చెంత

**లయమ్మున దేవునకంజలించి**
నిర్మలానందమున మున్గి నిలుతువేమొ
ఆరుబయట ధవళకాంతులద్దుచున్న
కౌముదీప్రభ కన్నార కాంతువేమొ

**ఇచట నిల్తును నేను నా యెదను వీడి**
త్రాణ కోల్పోయి రిక్తహస్తములతోడ
ఏ దిగంతసీమల చరియించు నీకు
ఎటుల సందేశమంపుటో యెరుగలేను

**మన మనస్సుల కలయిక మరచినావొ**
గతము సర్వమ్ము త్రుటి లోన కరగెనేమొ
ఏ వినూత్నజగతికేగినావొ నీవు!
తలతువొకపరి నన్నంచు తలచుచుందు

# సెలవింక..
## కెక్యూబ్ వర్మ

**అందుకే**
ఇప్పుడే ఇలా ముగిసిపోనీ-
ఎవరి చీదరింపులూ
చీత్కారాలు
లేకుండా...!
నడక మరచిన
కాళ్ళ సలుపు..-
చేయందుకోలేని
ఆత్మీయత...-
ముఖం చూసి
చీదరించుకొనే
యవ్వనం..-
యివన్నీ
అనవసరమే కదా...!

చూసిందింక చాలని
తిరిగి బాల్యాన్ని
పొందే ఆశతో
ఈ తెరను
ఇక్కడితో మూసివేస్తూ
సె
ల
విం
క..

***

# కృతఘ్నుడా !
## నెల్లుట్ల సుదర్శన్ రావు

**శుక,పిక కూజితాలు విని**
స్వర గతులను జత పరిచాడు !
వాటి గగన విహారాలు చూసి;
లోహ విహంగాలు కూర్చాడు !
గిజిగాడి గూడు చూసి
మేడలు పేర్చాడు !
పచ్చని వృక్షాల నీడన
చల్లగా సేద తీరాడు ;
వాటి ఫల సంతానాన్ని
ఫలహారం చేసాడు !
పంటల వంటలను
పంటికింద నూర్చాడు !
ముత్యాల వాన జల్లులు
వృక్షాల వలన పొందాడు !
ప్రతిదీ ప్రకృతి వరమే అయితే,
ప్రకృతినీ, పక్షులను
సంహరిస్తావెందుకు ?

***

# తరగని వెలుగు

శివరామ ప్రసాద్ మంగు

**చేతులు రెండూ బార్లా చాచి**
కళ్ళు మూసుకొని తల పైకెత్తి
నిటారుగా నిలబడి
ఆకాశములో కనిపించని దాన్నేదో
అదే పనిగా వెదుకుతున్నట్లు
నిస్సతువుగా నీరసంగా
ఆకులన్నీ రాలి పోయి
వాడి వదలి పోయి
గంభీర యోగ ముద్రలో
నిశ్చలంగా ఉందా చెట్టు
విశ్రాంతి ఆటముగింపు దానికి లేవు
సాయం సంధ్య నీరెండ వేళ
పడమటి చల్లని గాలి
దానిపై నుండి వీస్తుంది
ఎక్కడ నుంచో ఎగురుతూ వచ్చి
పక్షులు దానిపై వాల్తాయి
ప్రేమతో అవి అక్కడ చేరినా
వాటి తాకిడికి తట్టుకోలేక
వణుకుతుంది చెట్టు
శిశిరంలో జీర్ణ పత్రంలా
చెట్టు ఎడతెగని నీరీక్షణ
అంత దీక్షగా దేని కోసం?
ఆ మట్టిలో మొలకల నెత్తించే
తొలకరి వాన చినుకుల కోసమా?
నలు దిశలా వ్యాపించిన దాని కొమ్మలు
అణువణువూ పైకగసే ధూమరేఖలా
ఆకాశంలో కలిసిపోతున్నట్లు
ఎవరో భక్తితో ప్రార్థించి
అక్కడ వెలిగించిన దీపం
కాంతి కొద్దిగా తగ్గి మళ్ళీ పుంజుకుంది
తన తపస్సును ముగించుకుని వెళ్తూ
ఒక రుషి జ్యోతి రూపంలో
తన వెలుగును వదిలి వెళ్ళి నట్లు
వృక్షో రక్షతి రక్షిత: అన్నట్లు
చెట్టుపైన ఆకాశంలో రాత్రి చీకట్లో
లెక్కలేనన్ని నక్షత్రాలు
వెదజల్లిన అక్షతలలా
చిన్న పిల్లలు బ్లాక్ బోర్డ్పై
సుద్దముక్కతో పెట్టిన చుక్కలలా
ఒక్కొక్క నక్షత్రం ఒంపే వెలుగు
తరగని కాంతితో ఆకాశం ప్రకాశిస్తోంది
అలసిన మనస్సు చెట్టు క్రింద విశ్రమిస్తోంది

****



# ఆలోచనాలోచనాలు
ఎస్.కె.వి.రమేష్

### జీవనది
స్పందించే మనసు నాకుంది గనుకే
ఆ భగీరథుడు పిలువకుండానే
నాలో ఓ జీవనది ఒయంటుంది.

### యేరు
కోయిల గొంతు మూగవోయిందని
తన గళమెత్తి ఎలా పాడుతోందో
చూడా యేరు.

### స్వాగత తోరణం
లోకమంతటినీ విందుకాహ్వానిస్తూ
ఆ మాగాణింట ఎంతందంగా
స్వాగత తోరణం కట్టిందో
చూడా నాగలి.

### జోల
చిన్న కునుకైనా తనకు పట్టకపోతుందా?
మేలిమి ముత్యమంతటి స్వప్నాన్ని కనకపోతానా?
అన్న ఆశతో జీవితాంతమూ
జోల పాడుకుంటూనే పోతుందా నది

### అడుగులు
అడుగులంత అడుగులయ్యాక
ఆ అడుగులు నీ వెంట
అడుగులెందుకు వేస్తాయి?

***

# వర్తమానాన్ని వృధా కానీకు
డా.రామలక్ష్మి తాడేపల్లి

**వర్తమానాన్ని వృధా కానీకు**

గతం గుర్తుకు వస్తే గళం గద్గదమౌతుది,
భవిష్యత్తును ఊహిస్తే హృదయం భారమౌతుంది.
గతంలోని గాయాలను మాపనూలేము,
భవిష్యత్తులోని బాధలను ఆపనూలేము
.గతకాలపు గంధాలు తిరిగి గుబాళించాలని ఆశించనూలేము,
భవిష్యత్తంతా సుమవల్లికయై పరిమళించాలని శాసించనూలేము.
కనుక.....
గతించిన మనోహర వసంత సాంగత్యాన్ని
నీ సాటి విహారులందరిలా నీవూ మరచిపో!
మరుసటి వసంతం మరింత శోభావంతమై
నిరంతరం నిను మురిపించేందుకు ఒకింత ముందుండు
గతంలో గ్రుచుకున్న ముళ్ళ మార్గాన్ని ముందుగా గుర్తించి ,
భవిష్యత్తులో అవి మరల బాధించకుండా బాధ్యత వహించు.
క్షణం క్రితం నిన్ను ఊహలలో ఊరించి ,
మరో క్షణంలో నిన్నువెక్కిరిస్తూ వుడాయించే..
వర్తమానాన్ని వశపర్చుకో.
గతాన్ని జ్ఞాపకాలల్లో ఇముడ్చుకొని,
భవిష్యత్తుని ఊహలలో అమర్చుకొని,
వర్తమానాన్ని రమ్యంగా అలంకరించుకో.
అంతేకానీ..,
గతస్మృతుల సుడిగుండాలలో చిక్కుకుపోతూ ,
భవిష్యత్తు కై నిర్మించే పగటి కలల హర్మ్యాల మధ్య శిధిలమౌతూ,
నిన్నటి భవిష్యత్తునీ, రేపటి గతాన్నీ శాసించగల
వర్తమానాన్ని వృధా కానీకు.

***

# రసరేఖలు

శ్రీధర్ బచ్చోటి

మరల జనియించు కొర్కె నా మదిని నిండు
తరలిపోయిన యేండ్లెల్ల తిరిగి వచ్చి
చిగురుదొడగగ నాశింతు చిన్నతనము
చిన్నతనమున నీతోడ చెలిమియున్న

యౌవనమ్మున దివి తాకు యూహలందు
తేలిపోయిన దినములు తిరిగి రాగ
అనుపమానందమెగయు ప్రేమాంబరమున
మరల విహరింపనెంచుదు పరవశమున

చిత్తమును తెల్ప సంశయించితిని నాడు
మరల జనియింపనర్థింతు మదిని నేడు
తిరిగి నా కొరకీవు నా దరిని చేరి
కలసి నడచెదవంచును కాంక్ష సేతు

ఎదురుతెన్నులు చూచుచునిచట నిలుతు
చీకటిని దాటి నీవు వచ్చెదవటంచు
ఎన్నడును నను నీవు ప్రేమించలేదు
ఎన్నడైన పూర్ణముగ జీవించలేదు

వలయు వానికై యెప్పుడు కలలు కందు
కలలు మాత్రమె నేడు కావలయు నాకు
తీసియుంచుదు తలపుల తెరలనన్ని
ఎవరు వచ్చెదరేగెదరెవ్వరెపుడు?